

అక్షర సమరానికి అపూర్వ స్పందన

కడప అశోక్‌నగర్‌లో జరిగిన చర్చావేదిక సందర్భంగా.. ఇక్కడ ప్రధాన రహదారిలో ఇతర చోట్ల 62 స్పీడ్ బ్రేకర్లు ఉన్నాయి. అత్యవసర సమయంలో పేషంట్లను అంబులెన్స్‌లో ఆసుపత్రికి తీసుకుపోతే ఈ స్పీడ్ బ్రేకర్లు ఎక్కి దిగేలోపే చనిపోతారు. వీటిని తొలగించాలంటూ స్థానికులు ప్రస్తావించారు. ఇందుకు మేయరు సురేశ్‌బాబు స్పందించారు. దీనిపై చిన్నచౌకు ఎస్‌ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి ఒక అడుగు ముందుకు వేసి చర్చావేదిక ముగిసిన వెంటనే ఎక్సకవేటరును తీసుకువచ్చి కొన్ని స్పీడు బ్రేకర్లను తొలగించారు. ఇంత త్వరగా సమస్య పరిష్కారం కావడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.



స్పీడ్ బ్రేకర్లను ఎక్సకవేటర్‌తో తొలగింపజేస్తున్న ఎస్‌ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి



మురికి కాలువలను శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

- ఆంధ్రజ్యోతి ఏర్పాటు చేసిన ప్రజావేదికకు అనూహ్య స్పందన
- ప్రొద్దుటూరులో ఎమ్మెల్యే.. కడపలో మేయరు హాజరు
- సమస్యలు విన్నవించిన జనం...
- ఆలకించిన ప్రజాప్రతినిధులు, అధికారులు
- సమస్యల పరిష్కారానికి హామీ
- తక్షణమే.. కొన్ని సమస్యల పరిష్కారానికి చర్యలు
- ఆంధ్రజ్యోతి ప్రయత్నానికి అందరి ప్రశంసలు



అక్షరమే అండగా...

మా అక్షరం మీ ఆయుధం నినాదంతో రెండు దశాబ్దాలకు పైగా బాధితుల పక్షాన నిలుస్తున్న ఆంధ్రజ్యోతి.. ప్రజల సమస్యల పరిష్కారం దిశగా సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు వార్తలుగా వెలుగులోకి తీసుకువస్తున్న ఆంధ్రజ్యోతి.. మరొక అడుగు ముందుకు వేసి 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..' అంటూ ఆచరణాత్మక కార్యక్రమం చేపట్టింది. ప్రజాప్రతినిధులను, సంబంధిత అధికారులను ఒకే వేదికపైకి తీసుకొచ్చి.. ప్రజల సమ్యలను నేరుగా చెప్పించడం.. వీటి పరిష్కారానికి కృషిచేయడం కోసం నడుం బిగించింది. ఇందులో భాగంగా కడప నగరంలోని అశోక్‌నగర్‌లో చేపట్టిన కార్యక్రమానికి మేయర్ సురేశ్‌బాబు, మున్సిపల్ అధికారులు, స్థానికులు 175 మంది హాజరయ్యారు. ప్రజలు చెప్పిన పలు సమస్యలను పరిష్కరించాలని అప్పటికప్పుడే అధికారులను మేయర్ ఆదేశించారు. రోడ్లు, డ్రైన్లకు సంబంధించి రూ.30 లక్షలతో త్వరలో పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఇతర చిన్నచిన్న సమస్యలను 15 రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. ఇక ప్రొద్దుటూరు హనుమాన్‌నగర్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, కమిషనర్ మల్లికార్జున, దాదాపు 300 మంది స్థానికులు హాజరయ్యారు. రోడ్ల విస్తరణకు, మురుగునీటి కాలువల ఏర్పాటుకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. రూ.61లక్షలతో అనుమతులు పొంది ప్రారంభం కాని రోడ్డు పనులను వెంటనే ప్రారంభిస్తామన్నారు. ఆంధ్రజ్యోతి చేపట్టిన ఈ అక్షర యజ్ఞానికి అపూర్వ స్పందన లభించింది.

ప్రజా సమస్యల పరిష్కారానికి హామీల వర్షం



ఆంధ్రజ్యోతి ప్రజా సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

- రూ.60 లక్షలతో రోడ్ల నిర్మాణ పనులు
- డ్వాక్రా మహిళల కోసం కమ్యూనిటీ భవనం ఏర్పాటు
- మడూరు కాలువ అప్రోచ్ రోడ్డుపై ఆక్రమణల తొలగింపు
- బొల్లవరం-రామేశ్వరం రోడ్డు విస్తరణకు హామీ
- ఆంధ్రజ్యోతి ప్రజాసదస్సులో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): అక్షరమే అండగా ప్రజా సమస్యల పరి ష్కారమే అజెండాగా ఆంధ్రజ్యోతి ప్రారంభించిన ప్రజాసదస్సు విజయవంతమైంది. ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలోని 39వ వార్డు హనుమాన్ నగర్‌లో ఏడేళ్లుగా తిష్ట వేసినసమస్యలపై ఆంధ్రజ్యోతి కథనాలను ప్రచురించింది. మంగళవారం స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన ప్రజా సదస్సుకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక వార్డు కౌన్సిలర్ చింపిరి అనిల్‌కుమార్‌తో పాటు వార్డులోని మహిళలు సమస్యలపై ఏకరువు పెట్టారు. ముఖ్యంగా బొల్లవరం-రామేశ్వరంను అనుసంధానం చేసే హనుమాన్‌నగర్ మెయిన్ రోడ్డు విస్తరణకు నోచుకోక కుచించుకుపోయిందని.. రోడ్డు ధ్వంసమైందని వెల్లడించారు. అలాగే ఆంజనేయస్వామి ఆలయం వీధి రోడ్డు కూడా అధ్వానంగా మారిందని తెలిపారు. మడూరుకాలువ అప్రోచ్ రోడ్డులో జరిగిన ఆక్రమణలపై వివరించి.. వెంటనే తొలగించి గాంధీరోడ్డుకు అనుసంధాన మార్గం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక డ్వాక్రా మహిళలు 750 మంది ఉన్నారని.. సమావేశాలు నిర్వహించు కోవడానికి కమ్యూనిటీ భవనం నిర్మించాలని కోరారు. స్థానికంగా యువత గంజాయి మత్తుకు బానిస అవుతున్నారని పోలీసులు ఈ ప్రాంతంపై దృష్టి పెట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆంధ్రజ్యోతి చేపట్టిన ప్రజాపరిష్కార వేదిక ప్రజల సమస్యల పరిష్కారానికి చక్కటి మార్గమన్నారు. ప్రజలు సదస్సులో తెలిపిన పలు సమస్యలపై ఆయన స్పందించారు.



బొల్లవరం రామేశ్వరం రోడ్డు అక్రమణలను కమిషనర్‌తో కలసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

- రెవెన్యూ రికార్డుల ప్రకారం రోడ్ల విస్తరణ పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటాం. మొదటగా టెండర్లు పూర్తయి నిధులు లేక ప్రారంభం కానీ పెండింగ్‌లో వున్న రూ.60 లక్షల మేర పనులు పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకుంటాం.
- మడూరుకాలువ అప్రోచ్‌రోడ్డు ఆక్రమణలు తొలగించే పనులు చేపడతాం.
- యువత గంజాయి మత్తుకు బానిస కాకుండా పోలీసులతో నిఘా పెడతాం.

కమిషనర్ మల్లికార్జున మాటల్లో...

- సచివాలయం మీద కమ్యూనిటీ భవనం నిర్మాణానికి త్వరలో ప్రతిపాదనలు సిద్ధం చేసి.. కౌన్సిల్ ఆమోదంతో పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం.
- మడూరు కాలువ అప్రోచ్ రోడ్డు ఆక్రమణలు తొలగించేందుకు న్యాయపరమైన ఇబ్బందులను అధిగమించే చర్యలు తీసుకుంటాం.
- బొల్లవరం-రామేశ్వరం రోడ్డు విస్తరణకు మార్కింగ్ పనులు పూర్తిచేస్తాం. స్థానికులు సహకరిస్తే రోడ్డు విస్తరణ పూర్తి చేస్తాం.

కార్యక్రమంలో మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ నాగరాజు, డీఈ ప్రభాకర్‌దాస్, ఏఈ దిల్‌షాద్, విద్యుత్ ఏఈ రాజబాబు, మెప్మా సీఎంఎం మహలక్ష్మి, ఆర్‌ఐ నాగమోహన్‌రెడ్డి, త్రీటౌన్ ఎస్‌ఐ యోగేంద్ర, స్థానిక టీడీపీ ఇన్‌చార్జ్ చెంగా సిద్దయ్య, మున్సిపల్ కౌనిలర్లు మురళీధర్‌రెడ్డి, కమాల్‌బాషా, బీసీ ప్రజా చైతన్య సమాఖ్య అధ్యక్షుడు బొర్రా రామాంజనేయులు, టౌన్‌బ్యాంకు డైరెక్టర్ గంగాధర్ పాల్గొన్నారు. ప్రజా సదస్సుకు సమన్వయకర్తగా ఆంధ్రజ్యోతి ప్రొద్దుటూరు పీసీ ఇన్‌చార్జ్ సోమా రవి వ్యవహరించారు. సర్క్యులేషన్ జిల్లా ఇన్‌చార్జ్ రామ్మోహన్‌రెడ్డి సదస్సు ఉద్దేశ్యాన్ని వెల్లడించారు.

అక్రమణలను తొలగించి.. రోడ్డు విస్తరణ పనులు చేపట్టండి

- ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు అర్బన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): అక్షరం అండగా పరిష్కారమే అజెండాగా ఆంధ్రజ్యోతి ఏబీఎన్ సారధ్యంలో స్థానిక హనుమాన్‌నగర్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, మున్సిపల్, రెవెన్యూ, పోలీస్‌శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు రోడ్డు సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా.. కార్యక్రమం ముగిసిన వెంటనే అధికా రులతో కలసి మడూరు కాలువను పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ ఎమ్మెల్యేకు పట్టణమ్యాప్‌ను చూపిస్తూ కాలువ అక్రమణ స్థితిని వివరించారు. మడురు కాలువ పక్కనే ఉండాల్సిన రోడ్డు, బొల్లవరం నుంచి రామేశ్వరం రోడ్డు అక్రమణకు గురికావడంతో ఫీల్డ్ మెజర్‌మెంట్ బుక్ (ఎఫ్‌ఎంబీ) ప్రకారం రోడ్డు విస్తరణ ఎంత ఉందో ఆ మేరకు అక్రమణలను తొలగించి పనులు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ మల్లికా ర్జునకు ఆయన ఆదేశించారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామని కమిషనర్ ఆయనకు తెలిపారు.



అక్రమణలకు గురైన మడూరు కాల్వ రోడ్డును మ్యాప్‌లో పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ప్రజలకు ప్రజాప్రతినిధులకు వారధిగా...

సమస్యల పరిష్కారం దిశగా..

- ఆంధ్రజ్యోతి చర్చావేదికకు అపూర్వ స్పందన



మాట్లాడుతున్న మేయర్ సురేష్‌బాబు, వేదికపై ఆంధ్రజ్యోతి మేనేజర్ అబ్బిగారి నరసయ్య, ఎడిషన్ ఇన్‌చార్జ్ దేవేంద్రాచారి, బ్యూరో ఇన్‌చార్జ్ ఆంజనేయులు, కార్పొరేటర్ బండి జయమ్మ, ఎస్‌ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి

(కడప- ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి అంటే.. డేరింగ్, డ్యాషింగ్ జర్నలిజానికి మారుపేరు. తప్పు చేస్తే ఎంతటి వారినైనా వదిలిపెట్టదని.. నిర్భయంగా వార్తలు రాస్తుందని.. ఏబీఎన్‌లో ప్రసారం చేస్తుందని జనం నమ్మకం. అందుకే పాఠకుల, వీక్షకుల నమ్మకాన్ని ఎప్పుడూ ఆంధ్రజ్యోతి - ఏబీఎన్ వమ్ము చేయలేదు. జనం ఎదుర్కొంటున్న సమస్యలను అటు పత్రికల్లో ప్రచురించడం, చానల్‌లో ప్రసారం చేసి పరిష్కారం కోసం వాటిని అధికారుల వద్దకు తీసుకెళ్లేది. అయితే ఈ సారి ఏకంగా జనం ఎదుర్కొంటున్న సమస్యల గురించి వాటి పరిష్కారం కోసం ఓ వేదికను ఖరారు చేసింది, ఇందులో భాగంగా మంగళవారం కడప, ప్రొద్దుటూరులో అక్షరమే అండగా.. పరిష్కారమే అజెండాగా నిర్వహించిన చర్చా వేదిక కార్యక్రమానికి అపూర్వ స్పందన లభించింది. జనం దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించి వాటి పరిష్కారం కోసం ఆంధ్రజ్యోతి చర్చావేదికను బాగా ఉపయోగించుకున్నారు. సభకు వచ్చిన జనం వారి ప్రాంత సమస్యలతో పాటు వ్యక్తిగత సమస్యలను ప్రస్తావించారు. ఇందుకు ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించారు.

కడప అశోక్‌నగర్‌లో నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిధిగా మేయ రు సు రేశ్‌బాబు హాజరయ్యారు. ఇక్కడ జనం చెప్పిన సమస్యలపై వెంటనే స్పందించారు. ఆయన పరిధిలో ఉన్న మేరకు వెంటనే స్పందించి 15 రోజుల్లోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇందుకోసం వెంటనే అంచనాలు రూపొందించాల్సిందిగా ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఇక్కడ జనం వ్యక్తిగత అవసరమైన పింఛన్లు, ఇంటిస్థలాలు, సదరం సర్టిపికెట్లు, సీసీ రోడ్లు, డ్రైనేజీ, స్పీడ్‌బ్రేకర్లు, రోడ్లపై మురుగునీరు , పారిశుధ్యంపై వేదిక దృష్టికి తెచ్చారు. అయితే వ్యక్తిగతమైన పింఛన్లు, స్థలాలు, సదరం సర్టిఫికెట్లు ప్రభుత్వ పరిధిలో ఉంటాయి. మిగతా సమస్యలపై మేయరు వెంటనే స్పందించారు. జనం అడిగిన ప్రతి సమస్యకు పరిష్కారానికి అధికారులను ఆదేశించడంతో పాటు స్పష్టమైన హామీ ఇచ్చారు. ఇక్కడ కొన్ని చోట్ల సీసీరోడ్లు లేవు, రోడ్లు ఎగుడు దిగుడుగా ఉన్నాయి. వీటి నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. ఇక ప్రధాన రహదారిలో వాకింగ్‌కు వెళ్లే విధంగా తయారు చేయాలని కోరగా, వెంటనే స్పందించారు. ఇక ప్రధాన రహదారిలో ఓపెన్ డ్రైనేజీపై దాన్ని క్లోజ్ చేయాలని ఆదేశించారు. వెంటనే వీధిలైట్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రధాన రహదారిలో మురుగునీరు, పారిశుధ్యంపై వార్డు సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సీరియస్‌గా వార్నింగ్ ఇచ్చారు. జనం సమస్యల పరిష్కారం కోసమే సచివాలయాలు ఏర్పాటు చేసింది. మీరు పరిష్కరించకుండా ఎందుకు నిర్లక్ష్యంగా ఉన్నారంటూ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. మురుగుకాల్వ లు శుభ్రం చేయాలని ఆదేశించారు. ఇక్కడ సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను త్వరలో ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఇంకా ఎంతమేర సీసీ రోడ్డువేయాలి, డ్రైన్లు కట్టాలో అంచనా వేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఇక స్పీడ్ బ్రేకర్ల వల్ల జరిగే అనర్థాలను వివరించాలని వార్డు సభ్యులకు సూచించారు.





సమస్యలను మేయర్‌కు వివరిస్తున్న స్థానిక మహిళలు, (ఇన్‌సెట్లో) స్థానిక సమస్యలపై మాట్లాడుతున్న బోనం సిలాజ్

ఆంధ్రజ్యోతి ఇంతటితో వదల్లేదు...

ఆంధ్రజ్యోతి కడప, ప్రొద్దుటూరులో చర్చావేదికను నిర్వహించి మమ అని వదిలేయలేదు. మేయరు సురేశ్‌బాబు, ఎమ్మెల్యే వరద ఇచ్చిన హామీలను అమలయ్యేలా వారితో నిరంతరం టచ్‌లో ఉంటుంది. సమస్య పరిష్కారం అయ్యాక అదే వేదికతో వారితో సక్సెస్ మీట్ నిర్వహించనుంది.





అల్లరిమూకలను అరికట్టాలంటూ ఎస్‌ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి దృష్టికి తెస్తున్న స్థానికుడు, చర్చా వేదికకు హాజరైన స్థానికులు

మోడల్ కిచెన్లను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

- కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్

సీకెదిన్నె, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మోడల్ కిచెన్లను రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ తెలిపారు. చింతకొమ్మదిన్నె, జె.కొత్తపల్లె ఉన్నత పాఠశాలల్లో మోడల్ కిచెన్ ఏర్పాటు చేసే ప్రదేశాలను మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆకాంక్షిత జిల్లాల్లో ఎంపికైన ఆకాంక్షిత బ్లాక్‌లలో పైలెట్ ప్రాజెక్టు కింద చేట్టనున్న మోడల్ కిచెన్‌ను రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. మొదట చింతకొమ్మదిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ప్రస్తుతం అమలులో ఉన్న డొక్కా సీతామ్మ మధ్యాహ్న భోజనం పరిశీలించి.. వంట నిర్వాహకులతో మాట్లాడారు. మెనూ ప్రకారం పిల్లలకు భోజనం అందిస్తున్నారా లేదా, వంట గది సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. సరుకులు, వంటచెరకు, వంట గ్యాస్ తదితర వంట నిర్వాహణకు అయ్యే ఖర్చులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జె.కొత్తపల్లె పాఠశాలలో నిర్మించే మోడల్ కిచెన్ ప్లాన్‌పై అధికారులకు పలు సలహాలు, సూచనలు అందించారు. విద్యార్థులకు మంచి పౌష్టికాహారం అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని.. అందుకు అనుగుణంగా రుచిగా, శుచిగా విద్యార్థులకు భోజనం అందించాలన్నారు. కార్యక్రమంలో కడప ఆర్డీవో జాన్‌ఇర్విన్, తహసీల్దారు నాగేశ్వరరావు, ఆర్‌ఐ ఆదిరాజు, మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా రీసర్వే చేపట్టాలి

రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా రీ సర్వే చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ తెలిపారు. చింతకొమ్మదిన్నె మండ లం పెద్ద కాంపల్లె గ్రామ రెవెన్యూ పొలాల్లో జరుగుతున్న రీసర్వే పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా రెవెన్యూ సిబ్బంది, వీఆర్వో, సర్వేయర్లతో కలిసి విలేజ్ మ్యాప్‌ను పరిశీలించారు. రోవర్ ద్వారా రీసర్వే ప్రక్రియ ఎలా నిర్వహిస్తున్నారనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా నిర్ణీత గడువులోగా రీసర్వే పనులు పూర్తి చేయాలన్నారు. రైతులకు పూర్తి అవగాహన కలిగించి వారి హద్దులను చూపించి సర్వే పారదర్శకంగా, ఎటువంటి అనుమానాలకు తావులేకుండా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా రీ సర్వే వల్ల ఏవైనా ఇబ్బందులు కలుగుతున్నాయా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. ఆర్డీవో జాన్ ఇర్విన్, తహసీల్దారు నాగేశ్వరరావు, సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



వంట గది నిర్మాణంపై కలెక్టర్‌కు వివరిస్తున్న తహసీల్దారు నాగేశ్వరరావు


సమస్యల పరిష్కారానికి సిద్ధంగా ఉన్నాం : మేయర్

కడప ఎన్టీఆర్ సర్కిల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): అక్షరం అండగా... పరిష్కారమే అజెండాగా అనే నినాదంతో ఆంధ్రజ్యోతి ఏబీఎన్ ఆధ్వర్యంలో కడప నగరంలోని అశోక్‌నగర్ రెండవ సచివాలయం వద్ద మంగళవారం పరిష్కారం వారధిగా ఏర్పాటు చేసిన చర్చా వేదికకు ప్రజల నుంచి అనూహ్యస్పందన వచ్చింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన నగర మేయర్ కె.సురేష్‌బాబు మాట్లాడుతూ ఆంధ్రజ్యోతి దినపత్రిక ఒక మంచి కార్యక్రమాన్ని చేపట్టడం ఎంతో సంతోషకరమన్నారు. ఒక పక్క ప్రజల సమస్యలను వార్తలు రూపంలో అధికారుల దృష్టికి తీసుకురావడమే కాకుండా అధికారులను ప్రజా ప్రతినిధులను ప్రజలను ఒకే వేదికపై చేర్చడం వారి సమస్యలను పరిష్కరించేందుకు ఒక చర్చా వేదికను ఏర్పాటు చేయడం శుభ పరిణామమన్నారు. మూడు దశాబ్దాలకు పైగా ప్రజాప్రతినిధిగా అశోక్‌నగర్ ప్రాంత అభివృద్ధికి తాను ఎంతగానో కృషిచేశానన్నారు. ప్రస్తుతం కార్పొరేషన్ ద్వారా మరిన్ని నిధులు ఈ ప్రాం తానికి కేటాయించి స్థానిక సమస్యలు పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

ఆంధ్రజ్యోతి ఎడిషన్ ఇన్‌చార్జి సుంకోజి దేవేంద్రాచారి మాట్లాడుతూ 23 సంవత్సరాలకు పైగా ఆంధ్రజ్యోతి ప్రజల పక్షాన పోరాడుతోందన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూనే మరోపక్క ప్రజల సమస్యలను నేరుగా అధికారులు, పాలకవర్గాలను ఏకం చేసి చర్చించి సమస్యలు పరిష్కరించేందుకు పరిష్కార వారధిగా చర్చా వేదికను నిర్వహించడం జరుగుతోందని ఆయన పేర్కొన్నారు. కార్పొరేటర్ జయమ్మ మాట్లాడుతూ అశోక్‌నగర్ పరిధిలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని, కొన్ని చోట్ల రోడ్లు, డ్రైనేజీ పనులు అసంపూర్తిగా ఉన్నాయని త్వరలో వాటినీ పూర్తిచేస్తామన్నారు. రాజరాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ కేవలం వార్తలు రాయడం కాకుండా ఎంతో బాధ్యతగా ప్రజల పక్షాన చర్చ వేదికలు నిర్వహించడం సంతోషకరమన్నారు. చర్చా వేదికలో స్థానిక సమస్యలు పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఈఈ ధనలక్ష్మి, ఏసీపీ మునిరత్నం, ఆంధ్రజ్యోతి కడప యూనిట్ మేనేజర్ అబ్బిగారి నరసయ్య, ఆంధ్రజ్యోతి బ్యూరో ఇన్‌చార్జి ఎక్కంటి ఆంజనేయులు, ఏబీఎన్ స్టాఫ్ రిపోర్టర్ శ్రీనివాసులు, చిన్నచౌక్ ఎస్‌ఐ రవికుమార్, కార్పొరేటర్లు మల్లికార్జున్‌రెడ్డితో పాటు సచివాలయ సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కన్నీటి..కర్బూజ..!

- పంటను దెబ్బతీసిన వైరస్...ప్రతికూల వాతావరణం
- లోపల తెల్లగా గూడు కట్టడంతో తినేందుకు పనికిరాని కాయలు
- కోయకుండా పొలాల్లో వదిలేస్తున్న వైనం
- భారీగా తగ్గిన దిగుబడి
- పెట్టుబడులు కూడా రాక రైతులకు తీవ్ర నష్టం



కాయ లోపల తెల్లగా గూడుకట్టి తొర్రగా ఉన్న దృశ్యం



వేపూరికోట సమీపంలో వైరస్ సోకడంతో పొలంలో వదిలేసిన కర్బూజ కాయలు

ములకలచెరువు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కర్బూజ పంట రైతులకు కన్నీళ్లు మిగిల్చింది. రూ.లక్షలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన పంటను వైరస్...ప్రతికూల వాతావరణం కోలుకోలేని విధంగా దెబ్బతీసింది. పంట సాగు చేసిన ప్రారంభంలో వరుసగా వచ్చిన తుఫాన్లతో వర్షాలు కురవడం...విపరీతమైన మంచు..ఎండ లేకపోవడంతో వైరస్‌లు చుట్టుముట్టాయి. నివారణకు ఎన్ని రకాల మందులు పిచికారీ చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. ఫలితంగా కాయ లోపల తెల్లగా గూడు కట్టి గట్టిగా తొర్ర ఏర్పడడంతో తినడానికి పనికిరాకుండా పోయాయి. దిగుబడి కూడా భారీగా తగ్గిపోయింది. దీంతో అంతంతమాత్రంగా దిగుబడి రావడంతో చేసేది లేక కాయలను కోయకుండా పొలాల్లోనే వదిలేస్తున్నారు.

తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ములకలచెరువు, తంబళ్లపల్లె, పెద్దమండ్యం, బి.కొత్తకోట, కురబలకోట, పెద్దతిప్పసముద్రం మండలాల్లో రైతులు సుమారు వెయ్యి ఎకరాల్లో కర్బూజ పంట సాగు చేశారు. ఎకరా సాగుకు రూ.లక్ష నుంచి రూ.1.20 లక్షల వరకు ఖర్చు చేశారు. గత ఏడాది అక్టోబరు, నవంబరు మొదటి వారంలో పంట సాగు చేశారు. డిసెంబర్‌లో వచ్చిన తుఫాన్ కారణంగా ఎండకాయకపోవడంతో వైరస్‌లు విపరీతంగా సోకాయి. దీంతో రైతులు పలు రకాల మందులు పిచికారీ చేసినా ఫలితం లేకుండాపోయింది. ఈ క్రమంలో ప్రస్తుతం పంట దిగుబడి వస్తోంది. కాయలు సైజు రాకపోగా వైరస్ కారణంగా లోపల తెల్లగా గూడు కట్టి గట్టిగా ఉంది. 80 శాతం కాయలు వైరస్ బారిన పడి తినడానికి వీలు లేకుండాపోయింది. దీంతో వ్యాపారులు పొలాల వద్దకు వచ్చి మంచి కాయలు మాత్రమే కోసుకెళ్లి వైరస్ సోకిన కాయలు వదిలేస్తున్నారు. వైరస్ సోకిన కాయలు పనికి రాకుండా పోవడంతో రైతులు పొలాల్లోనే వదిలేస్తున్నారు.

ఎకరాకు మూడు టన్నులకులోపే...

వైరస్, ప్రతికూల వాతావరణంలో కర్బూజ దిగుబడి కూడా భారీగా తగ్గింది. గత ఏడాది ఎకరాకు రూ.10 నుంచి 15 టన్నుల కాయల దిగుబడి వచ్చింది. ఇప్పుడు మాత్రం ఎకరాకు రెండు నుంచి మూడు టన్నుల లోపు మాత్రమే దిగుబడి వస్తోంది. అలాగే గత ఏడాది కాయ సైజు ఎనిమిది నుంచి 12 కేజీల వరకు ఉండేది. ప్రస్తుతం కాయ సైజు ఏడు కేజీల లోపే ఉంది. దీనిని బట్టి చూస్తే దిగుబడి ఎంతమాత్రం వచ్చిందో అర్థం చేసుకోవచ్చు. అలాగే ధర కూడా తగ్గుముఖం పట్టింది. వారం రోజుల క్రితం వరకు కేజీ రూ.17 పలికిన ధర ప్రస్తుతం రూ.10 నుంచి రూ.12 మాత్రమే ఉంది.

రూ.5 లక్షలు ఖర్చు చేస్తే...రూ.4లక్షలు నష్టం..



ములకలచెరువు మండలం వేపూరికోట పంచాయతీ గురికివారిపల్లెకు చెందిన రైతు బాలాజీ నాలుగు ఎకరాలను కౌలుకు తీసుకుని పంట సాగు చేశాడు. సాగు ఖర్చు రూ.5 లక్షలు పెట్టుబడి ఖర్చు వచ్చింది. వాతావరణం అనుకూలించక వైరస్ సోకి, అధిక మంచు కారణంగా దిగుబడి భారీగా తగ్గిపోయింది. నాలుగు ఎకరాలకు రూ.లక్ష మాత్రమే వచ్చింది. రూ.5 లక్షలు పెట్టుబడి పెడితే రూ.4 లక్షలు నష్టం వచ్చింది. ఆరుగాలం కష్టపడి సాగు చేసిక పంట రైతును కష్టాల్లో ముంచింది. ప్రభుత్వం ఆదుకోవాలని కర్బూజ రైతులు వేడుకుంటున్నారు.

మూడు ఎకరాలకు..
ఐదు టన్నుల దిగుబడి వచ్చింది



ములకలచెరువు మండలం వేపూరికోట పంచాయతీ చీకుచెట్టుపల్లెకు చెందిన రైతు మూగి రవిచంద్ర మూడు ఎకరాల్లో కర్బూజ పంట సాగు చేశాడు. దీనికి రూ.3.50 లక్షలు ఖర్చు చేశాడు. ప్రస్తుతం పంట దిగుబడి వస్తోంది. 30 టన్నులకుపైగా రావాల్సి దిగుబడి కేవలం ఐదు టన్నులు మాత్రమే వచ్చింది. ఉన్న కాయల్లో 90 శాతం కాయలు వైరస్ బారిన పడ్డాయి. కాయ కోసి చూస్తే లోపల తెల్లగా గూడుకట్టి గట్టిగా ఉంది. ఐదు టన్నులకు ప్రస్తుతం ఉన్న ధరను బట్టి రూ.60 వేలు వచ్చింది. ఈ రైతుకు రూ.2.90 లక్షలు నష్టం వచ్చింది. వరుసగా ఏడేళ్లుగా పంట సాగు చేస్తున్న ఈ రైతుకు ప్రస్తుతం వచ్చిన నష్టం ఎప్పుడూ రాలేదు.

అధికారులు బోర్డు నాటారు.. కబ్జాదారులు తీసేశారు

- ప్రభుత్వ స్థలం అని నాటిన బోర్డును మాయం చేసిన వైనం
- సోమవారం రాత్రి గుట్ట చదును





ప్రభుత్వ స్థలం అని పది రోజుల క్రితం తహసీల్దార్ ఏర్పాటు చేసిన బోర్డు - బోర్డు తీసేసి సోమవారం రాత్రి గుట్ట చదును చేసిన దృశ్యం

సుండుపల్లె, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): సుండుపల్లె మండల కేంద్రానికి సమీపంలోని కంచిపాటివాండ్లపల్లె జగనన్న కాలనీ సమీపంలో పది రోజుల క్రితం కొందరు కబ్జా చేసేందుకు గుట్టను చదును చేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ దైవాదీనం ఇది ప్రభుత్వ స్థలమని, ఇతరులకు ఈ స్థలంలోకి అనుమతి లేదని బోర్డు నాటించారు. అయితే సోమవారం రాత్రి కొందరు ఆ బోర్డును తొలగించి యంత్రాలతో గుట్టను తవ్వి ఆ మట్టిని ట్రాక్టర్లతో తరలించినట్లు స్థానికులు చెబుతున్నారు. ప్రభుత్వ స్థలం అని అధికారులు బోర్డు నాటినా ఆక్రమణదారులు లెక్కచేయకుండా ఆ బోర్డును తొలగించి గుట్టను చదును చేస్తుండటం గమనార్హం. బోర్డు తొలగించి ఆక్రమణలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. విచ్చలవిడిగా ప్రభుత్వ స్థలాలు, గుట్టలు, చెరువులు, కుంటలు ఆక్రమణలు జరగడం వెనుక సరైన చర్యలు లేకపోవడమే కారణమని స్పష్టంగా తెలుస్తోంది. ఆ స్థలం చదును చేసింది ఎవరో కూడా రెవెన్యూ అధికారులకు తెలుసని అయినా వారిపైన చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి.

వెంటనే బోర్డు నాటిస్తాము

గుట్టను ఆక్రమించినట్లు సమాచారం రావడంతో గతంలో బోర్డు ఏర్పాటు చేయించాము. ఆ బోర్డును ఎవరు తొలగించారో తెలియదు. వెంటనే ఆ స్థలంలో బోర్డు తిరిగి ఏర్పాటు చేస్తాము.

- దైవాదీనం, తహసీల్దార్

కార్పెంటర్ ఆత్మహత్య



కార్పెంటర్ రవి మృతదేహం

కురబలకోట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనసానివారిపల్లెకు చెందిన కార్పెంటర్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో జరిగింది. దీనికి సంబంధించి ఎస్‌ఐ దిలీప్‌కుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కనసానివారిపల్లెకు చెందిన రవి (25) కార్పెంటర్‌గా పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కాగా ఇంటి స్థలం విషయమై తన సమీప బంధువులతో వివాదం నెలకొంది. దీంతో మనస్తాపానికి గురైన ఆయన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబీకులు, చుట్టుపక్కల వారు చికిత్స నిమిత్తం మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతికి రెఫర్ చేయగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ముదివేడు పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. ఈ మేరకు ముదివేడు ఎస్‌ఐ దిలీప్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శివరాత్రి వేడుకలకు కలెక్టరుకు ఆహ్వానం

బి.కొత్తకోట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): తమ ఆశ్రమంలో నిర్వహించే శివరాత్రి వేడుకలకు విచ్చేయాలని బి.కొత్తకోట మండలం బీరంగి వద్ద వెలసిన బండెన్నస్వామి ఆలయ పీఠాధిపతి లక్ష్మీపతిస్వామి కలెక్టరు శ్రీధర్‌ను ఆహ్వానించారు. మంగళవారం రాయచోటిలోని కలెక్టరేట్‌కు వెళ్లి ఆహ్వాన పత్రికను అందించారు. ఈ సందర్భంగా బండెన్న స్వామి ఆలయం గురించి కలెక్టరుకు పీఠాధిపతి వివరించారు. ఆయన వెంట పలువురు అధికారులు, అనుచరులు ఉన్నారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరికి జైలు శిక్ష

సిద్దవటం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): సిద్దవటం పోలీసుస్టేషన్ పరిధిలోని మంగళవాండ్లపల్లెలో 2013లో జరిగిన హత్యాయత్నం కేసులో ఇద్దరికి ఐదేళ్ల జైలుశిక్ష విధిస్తూ జడ్జి మంగళవారం తీర్పు ఇచ్చారు. అంత్యం సుబ్బయ్య, అంత్యం సురేష్ అనే నిందితులకు ఐదేళ్ల జైలుశిక్ష, ఒక్కొక్కరికి వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తూ బద్వేల్ అడిషనల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టు తీర్పు ఇచ్చారని పోలీసులు తెలిపారు.

భార్యాభర్తలపై దాడి





ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వెంకట్రమణారెడ్డి, లక్ష్మీదేవమ్మ

పెద్దతిప్పసముద్రం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : అందరూ చూస్తుండగానే ఓ వ్యక్తి ఇంట్లోకి జొరబడి భార్యాభర్తలను తీవ్రంగా గాయపరిచిన సంఘటన పెద్దతిప్పసముద్రం మండలంలో ఆలస్యంగా వెలుగు చూసింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రాపూరివాండ్లపల్లె పంచాయతీ డి.నారాయణపల్లెకు చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యుడు జల్లు వెంకట్రమణారెడ్డి, ఆయన భార్య లక్ష్మీదేవమ్మ వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన యువకుడు ప్రతాప్‌రెడ్డి ఆ దంపతులపై దాడి చేశాడు. గురువారం పట్టపగలు వెంకట్రమణారెడ్డి, లక్ష్మీదేవమ్మ దంపతులు ఇంటిలో ఉండగా అదే గ్రామానికి చెందిన ప్రతాప్‌రెడ్డి అనే యువకుడు ఇంట్లోకి జొరబడి ఆ ఇరువురిపైన విక్షణారహితంగా దాడి చేశాడు ఇంటిలోనుంచి వారిని బయటకు లాగి కాళ్లతో తన్నుతూ పిడిగుద్దులు గుద్దుతూ బీభత్సం సృష్టించాడు స్థానికులు మందలిస్తున్నా వినకుండా ఆ దంపతులపై దాడి చేసి కొట్టి గాయపరిచాడు ఆ దంపతుల అరుపులు విని స్థానికులు ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న వెంకట్రమణారెడ్డి కుమారుడు నాగిరెడ్డి బెంగళూరు నుంచి తల్లిదండ్రుల దగ్గరకు వచ్చి జరిగిన సంఘటనను తెలుసుకుని పోలీసులకు ప్రతాప్‌రెడ్డిపై ఫిర్యాదు చేశాడు. అతడి ఫిర్యాదు మేరకు దంపతులపై దాడి చేసిన ప్రతాప్‌రెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మంగళవారం పీటీఎం ఎస్‌ఐ రవికుమార్ తెలిపారు. తన గురించి మాట్లాడుతున్నారని వేరే వ్యక్తులు అతనికి చెప్పడంతో వారిపై విచక్షణారహితంగా దాడి చేశాడన్నారు. గతంలో ప్రతాప్‌రెడ్డిపై మర్డర్ కేసు ఉన్నట్లు ఎస్‌ఐ తెలిపారు. గత నెల క్రితం రంగసముద్రం పంచాయతీ కొత్తసుబ్బరాయుని గ్రామానికి చెందిన ఓ మైనార్టీ కుటుంబంపైన దాడి చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మదనపల్లె సమస్యలు పరిష్కరించండి

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి టీడీపీ, జనసేన నాయకుల విన్నపం



మంత్రి జనార్దన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న టీడీపీ, జనసేన నాయకులు

మదనపల్లె టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డికి మదనపల్లె టీడీపీ, జనసేన నాయకులు విన్నవించారు. మంగళవారం విజయవాడలోని రాష్ట్ర సచివాలయంలో మంత్రిని కలసిన తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు, జనసేన రాయలసీమ కన్వీనర్ గంగారపు రాందాస్ చౌదరి, జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడు సురేంద్రయాదవ్ సమస్యల గురించి వివరించారు. నియోజకవర్గంలోని మూడు మండలాల్లో సమస్యలు, పార్టీ నాయకుల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వీటిపై త్వరలోనే సమీక్షించి సమస్యలు పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దొరస్వామినాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు దేవరింటి శ్రీనివాసులు, బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి మేకల రెడ్డిశేఖర్, నిమ్మనపల్లె రమణ పాల్గొన్నారు.

ఉత్పత్తిదారుల సంఘాలతో రైతులకు ప్రయోజనం


- డీహెచ్‌వో రవిచంద్రబాబు



సమావేశంలో మాట్లాడుతున్న డీహెచ్‌వో రవిచంద్రబాబు

కలకడ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఉత్పత్తిదారుల సంఘాలతో మామిడి, టమోటా రైతులకు ప్రయోజనం కలుగుతుందని జిల్లా ఉద్యానవనశాఖ అధికారి రవిచంద్రబాబు అన్నారు. కలకడలో మంగళవారం ఆయన రైతులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ మండల రైతులకు సౌకర్యంగా ఉద్యానవనశాఖ, బీఆర్‌ఈడీఎస్ ఎన్‌జీవో (ఐపీసీ అనుబంధ సంస్థ) ఆధ్వర్యంలో రైతు సంఘాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. అందులో మొదట పది మందితో బోర్డు ఆఫ్ డైరెక్టర్లను ఎన్నుకోవడం తరువాత సంఘాన్ని కంపెనీ యాక్ట్ కింద రిజిష్టర్ అవుతుందన్నారు. ఇందులో సభ్యత్వం పొందేందుకు టమోటా, మామిడి రైతులు అర్హులన్నారు. పంట ఉత్పత్తులకు సరైన గిట్టుబాటు ధర కల్పించేలా ఐపీసీ మార్కెట్ లింకేజీ కొనుగోలుకు తోడ్పడుతుందన్నారు. అర్హులైన రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌వో కుమార్‌రెడ్డి, ఐపీసీ ప్రతినిధి భోజరాజు, రైతులు పాల్గొన్నారు.

ఈకేవైసీ తప్పక చేయించుకోవాలి



వేరుశనగను పరిశీలిస్తున్న డీఏవో చంద్రానాయక్

కలకడ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి):రబీ సీజన్‌లో పంటలు సాగు చేసి ఈ క్రాప్‌లో నమోదైన ప్రతి రైతు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని డీఏవో చంద్రానాయక్ తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన కలకడ మండల కేదొడ్డిపల్లె రైతు సేవా కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమన మాట్లాడుతూ స్మార్ట్ ఫోన్‌లు ఉన్న రైతులు ఎన్‌పీఎస్‌ఎస్ యాప్ ద్వారా వ్యవసాయానికి సంబంధించిన సలహాలు, సూచనలు పొందాలన్నారు. అనంతరం దేవళపల్లె, ఎనుగొండపాలెం, ముడియంవారిపల్లె గ్రామాల్లో సాగు చేసిన వేరుశనగ పంట విస్తీర్ణాన్ని క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. అలాగే రైతులకు పంట సాగుపై తగు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్రామయ్యచౌదరి, ఏవోలు లావణ్య, వెంకటమోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

రారండోయ్.. వేడుక చూద్దాం..

- నేటి నుంచి ఫిబ్రవరి 3 వరకు కోసువారిపల్లె వెంకన్న ఆలయ రాజగోపుర ప్రతిష్ఠ మహోత్సవం
- ఫిబ్రవరి 4 నుంచి 12 వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు
- ముస్తాబవుతున్న వెంకన్న ఆలయం

తంబళ్లపల్లె, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లెలో కొలువైన ప్రసన్న వేంకటరమణస్వామి ఆలయం రాజగోపుర ప్రతిష్ఠ మహోత్సవం, వార్షిక బ్రహ్మోత్సవాలకు సుందరంగా ముస్తాబవుతోంది. రెండు ఉత్సవాలు ఒకదాని తర్వాత ఒకటి ఉండటంతో ఉత్సవాలను వైభవంగా నిర్వహించడానికి టీటీడీ అధికారులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ రాజగోపుర ప్రతిష్ఠ మహోత్సవం, వార్షిక బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం పలుకుతూ ఉత్సవాల ఆహ్వాన పత్రికలను తిరుపతి టీటీడీ పరిపాలనా భవనంలోని జేఈవో కార్యాలయంలో టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈవో వరలక్ష్మీ ఆవిష్కరించారు. ఈనెల 29 తేదీ సాయంత్రం టీటీడీ వేదపండితుల వేదమంత్రోచ్చారణల నడుమ ఆలయ నూతన రాజగోపుర ప్రతిష్ఠ మహోత్సవానికి అంకురార్పణ చేపట్టనుండగా, ఫిబ్రవరి 2 వరకు ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలు, 3వ తేదీ ఉదయం చతుష్టానార్చన, మహాపూర్ణాహుతి, కుంభ ఉద్వాసన, ఉదయం 9:30 నుంచి 10.15 వరకు రాజగోపుర ప్రతిష్ఠ మహోత్సవం, కుంభప్రోక్షణ, శాత్తుమొర, నివేదన, మంగళహారతి, ఆచార్య బహుమానం కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అదేరోజు సాయంత్రం వెంకన్న వార్షిక బ్రహ్మోత్సవాలకు అంకురార్పణతో శ్రీకారం కానుండగా..12 వరకు బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు. భక్తులు రాజగోపుర ప్రతిష్ఠ మహోత్సవంతో పాటు, శ్రీవారి వాహన సేవల్లో పాల్గొని స్వామి వారిని దర్శించుకునేందుకు వీలుగా ఆలయం లోపల, వెలుపల టీటీడీ అధికారులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ పరిసరాలను రంగురంగుల విద్యుద్దీప తోరణాలతో పాటు స్వామి వారి విద్యుత్‌ద్దీప కటౌట్లను ఏర్పాటు చేస్తున్నారు. ఆలయం ప్రాంగణంలో చలువ పందిళ్ల వేసి కళాకారులు రంగురంగుల ముగ్గులను ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. మంగళవారం నాటికి ఏర్పాట్లు పూర్తవుతాయని ఆలయ అధికారి దిశంత్‌కుమార్, సిబ్బంది నగేష్ తెలిపారు.



తీర్చిదిద్దుతున్న రంగవల్లులు కళాకారుడు



ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటరమణ స్వామి

ఆలయ స్థల పురాణం..

క్రీస్తు పూర్వం 14వ శతాబ్దంలో వేంగి చోళ మహారాజు కోసువారిపల్లె ప్రసన్న వేంకటరమణ స్వామిని ప్రతిష్ఠించినట్లు శాసనం ద్వారా తెలుస్తోంది. విజయనగర సామ్రాజ్యానికి చెందిన శ్రీకృష్ణదేవరాయలు కుటుంబీకులైన అచ్యుతదేవరాయలు, కంభం తిమ్మరాజు స్వామి వారికి అనేక సువర్ణాభరములు చేసి అనేక మాన్యములు దానమిచ్చినట్లుగా శాసనంలో ఉంది. చోళ మహారాజు ఒకరోజు రాత్రి ఈ ప్రదేశం (ప్రస్తుతం ఆలయం ఉన్న ప్రదేశం)లో బస చేయగా స్వామి వారు కలలోకి వచ్చి ఈ ప్రదేశంలో ఆలయం నిర్మించమని కోరగా వెంటనే చోళ మహారాజు ఆలయం నిర్మించినట్లు స్థల పురాణం చెబుతోంది. తాళ్లపాక అన్నమాచార్యులు కూడా ఆలయంలో స్వామి వారిని దర్శించుకుని అనేక సంకీర్తనలు రచించినట్లు పురాణాలు చెపుతున్నాయి.

వెంకన్న బ్రహ్మోత్సవాలు ఇలా..

ఫిబ్రవరి 3వ తేదీ సోమవారం సాయంత్రం 6 గంటలకు వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ అంకురార్పణంతో వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. 4న ఉదయం ధ్వజారోహణం, రాత్రి పల్లకీ ఉత్సవం, 5న ఉదయం శేష వాహనము, రాత్రికి హంస వాహనం, 6న ఉదయం ముత్యపు పందిరి వాహనం, రాత్రి సింహవాహనం ఉంటాయి. 7వ తేదీ ఉదయం కల్పవృక్ష వాహనం, రాత్రి హనుమంత వాహనం, 8న ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రి చంద్రప్రభ వాహనం, 9న ఉదయం సర్వభూపాల వాహనం, రాత్రి 8 గంటలకు శ్రీవారి కల్యాణోత్సవం, అనంతరం 10:30 గంటలకు గరుడ వాహన సేవ, 10న ఉదయం రథోత్సవం, రాత్రి గజవాహనం, 11న ఉదయం పల్లకీ ఉత్సవం, రాత్రి అశ్వవాహనంపై స్వామి వారు విహరించనున్నారు. 12న ఉదయం 7 నుంచి 9 గంటల నడుమ వసంతోత్సవం, 11:30 గంటలకు చక్రస్నానం, రాత్రి 7 గంటలకు ధ్వజావరోహణం, 13న ఉదయం స్నపన తిరుమంజనం, సాయంత్రం 5 నుంచి 8 గంటల మధ్య పుష్పయాగంతో శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని టీటీడీ అధికారులు తెలిపారు. శ్రీవారికి వాహన సేవలు ఉదయం 8 గంటల రాత్రి 8 గంటలకు నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాల సమయంలో ప్రతిరోజూ ఉదయం 10:30 నుంచి 12 గంటల వరకూ స్వామి వారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం జరుతుందని టీటీడీ అధికారులు తెలిపారు.



నూతనంగా నిర్మించిన కోసువారిపల్లె ప్రసన్న వేంకటరమణ స్వామి ఆలయ రాజగోపురం

ఇసుక రీచ్‌ను తలపిస్తున్న దేవగుడి పెన్నానది

● అడ్డూ అదుపు లేకుండా ఇసుక రవాణా
● నిద్రావస్థలో అధికారులు



దేవగుడి పెన్నానదిలో ఇసుక నింపుతున్న దృశ్యం

జమ్మలమడుగు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో అధికారులు నిద్రావస్థ వీడాలని పలుప్రాంతాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రొద్దుటూరు రోడ్డులో పెన్నానది పరిసర ప్రాంతాలన్నీ ఇసుక రీచ్‌లు తలపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పి.సుగుమంచిపల్లె గ్రామం పెన్నానది నుంచి దేవగుడి గ్రామం జిల్లా పరిషత్ హైస్కూలు వెనుకభాగాన రాత్రి, పగలు ఇసుక తరలిపోతోంది. ఇసుక అక్రమ రవాణా గురించి స్థానిక ప్రజలు సంబంధిత అధికారులకు ఫొటోలు తీసి సమాచారం ఇచ్చినా ఏ ఒక్క అధికారీ భయంతో రావడం లేదని కొందరు మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రొద్దుటూరు రోడ్డులో రాత్రి టిప్పర్ల ద్వారా ఇసుక తరలిపోతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. దానవులపాడు పెన్నానదిలో దేవగుడి, పి.సుగుమంచిపల్లె తదితర గ్రామాల్లో భారీగా ఇసుక తరలిపోతోందని ఆ ప్రాంతీయులు వాపోతున్నారు. ముద్దనూరు రోడ్డులో పొన్నతోట, గూడెం చెరువు, అంబవరం, గూడుమస్తాన్‌వలి దర్గా వెనుక భాగాన మున్సిపాలిటీకి సంబంధించిన కంపోస్టు యార్డు సమీపంలో, మోరగుడి గ్రామం టీచర్స్ కాలనీ, రచ్చబండ వద్ద మైలవరం మండలం దొమ్మరనంద్యాల, వేపరాల గ్రామాల్లో జోరుగా ఇసుక తరలిస్తున్నారు. ఇసుక అవసరం లేకున్నా పొలాల్లో, ఖాళీ స్థలాల్లో ఇసుక ట్రాక్టర్ల యజమానులు డంప్ చేసి అక్కడి నుంచి లారీల్లో, టిప్పర్లలో బయటి ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఏప్రిల్, మే నెలల్లో చుట్టుపక్కల గ్రామాలకు పెన్నానదిలో ఉండే బోర్లకు నీటి సమస్య ఏర్పడే అవకాశం ఉందని, అధికారులు నిద్రావస్థను వీడి కేసులు నమోదు చేయాలని పలువురు కోరుతున్నారు.

విద్యార్థి చెయ్యి విరగడంపై విచారణ



విద్యార్థిని విచారిస్తున్న ఎంఈఓ శోభారాణి

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): వసంతపేట మున్సిపల్ హైస్కూల్ విద్యార్థి శివరాంను ఉపాధ్యాయుడు కొట్టడంతో విద్యార్థి చెయ్యి విరిగిన సంఘటనపై ఎంఈఓలు సావిత్రమ్మ, శోభారాణి విచారణ జరిపారు. పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న విద్యార్థి 23వ తేదీ పాఠశాలకు పుస్తకాలు తీసుకురాలేదని ఆగ్రహించిన సైన్స్ ఉపాధ్యాయుడు మురళి ఆ విద్యార్థిని కొట్టాడు. దీంతో ఆ విద్యార్థి చెయ్యి విరిగింది. ఈ సంఘటనపై విద్యార్థి, ప్రజా సంఘాల నేతలు మంగళవారం డీఈఓ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. దీంతో డీఈఓ షంషుద్దీన్ విచారణకు ఆదేశించారు. డీఈఓ ఆదేశాల మేరకు డిప్యూటీ డీఈఓ కార్యాలయంలో ఎంఈఓలు విద్యార్థి శివరాం, తండ్రి మహేష్‌ను విచారించారు. అనంతరం ఎంఈఓలు మాట్లాడుతూ డీఈఓ ఆదేశాల మేరకు బుధవారం మరోసారి పాఠశాలకు వెళ్లి విద్యార్థులు, ఉపాధ్యాయులుతో విచారించి డీఈఓకు నివేదిక పంపనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సుజాత, ప్రజా సంఘాల నేతలు ఓబులేసు, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

గోపవరం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల కిందట రోడ్డు ప్రమాదంలో గాయపడి తిరుపతి రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు బద్వేలు శరత్‌కుమార్ (22) మృతి చెందాడు. శరత్‌కుమార్ జీవనోపాధి కోసం శ్రీనివాసపురం వద్ద పెట్రోలు బంకులో పనిచేస్తుండేవాడు. డ్యూటీ ముగించుకుని ఇంటికి బైక్‌లో వస్తుండగా నెల్లూరు రోడ్డులో ఆర్టీసీ బాడుగ బస్సు ఢీకొంది. గాయపడిన ఆయనను చికిత్స నిమిత్తం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. గాయపడిన యువకుడికి చికిత్స కోసం ఆర్థిక సాయం అందించాలని బస్సు యాజమాన్యంతో సంప్రదించినా ఫలితంలేదు.

లారీ... చోరీ...

రైల్వేకోడూరు రూరల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): కుక్కలదొడ్డి ప్రధాన రహదారిపై నిలుచున్న 12 చక్రాల లారీని గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించారని లారీ డ్రైవర్ బాల వెంకటరెడ్డి ఫిర్యాదు చేశారు. హైదరాబాద్ నుంచి తిరుపతికి ఐరన్‌లోడుతో వెళ్తూ కుక్కలదొడ్డి వద్ద భోజనం చేసి రాగా లారీ దొంగలించినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నవీన్ బాబు తెలిపారు.

అతివేగం - ప్రమాద సంకేతం

నైపుణ్యం చూపే తాపత్రయం ● బైక్‌ను అదుపు చేయలేని వయస్సు ● ట్రాఫిక్ ఆంక్షలపై అవగాహన లేని వైనం
నెత్తురోడుతున్న రోడ్లు ● ప్రాణాలు కోల్పోతున్న యువత ● కన్నీరుమున్నీరవుతున్న కుటుంబీకులు



వయసుకు మించిన బరువైన వాహనం (బుల్లెట్)లో యువకుడు

బద్వేలుటౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రకరకాల మోడళ్లలో ద్విచక్ర వాహనాలు మార్కెట్‌లోకి వస్తున్నాయి. వాటి రంగులు, వేగం యువతను ఆకట్టుకుంటుండడంతో ట్రాఫిక్ ఆంక్షలపై అవగాహన లేమితో రయ్ రయ్‌మంటూ దూసుకెళ్తున్నారు. అతి వేగం ప్రమాద సంకేతం అంటూ పెద్దలు అరుస్తున్నా తను నడుపుతున్న వాహనంపై నైపుణ్యాన్ని ప్రదర్శించాలనే తాపత్రయంలో అతి బరువైన బైక్‌ను అదుపు చేసే వయస్సు చాలక ప్రమాదాల భారిన పడుతున్నారు. నెత్తురోడుతున్న రోడ్లను చూసి కుటుంబీకులు కన్నీరుమున్నీరవుతున్నారు. నిత్యం రోడ్ల ప్రమాదాలు జరుగుతున్న విధానాలు చూస్తున్నా యువత అతివేగంగా బైక్‌ను నడుపుతుండడంతో వారికి ఎదురొచ్చిన వాహనాలు సైతం ప్రదాలకు గురవుతున్నాయి. అతివేగం, ఆవేశం ఏది ఎక్కువైనా మూల్యం చెల్లించుకోక తప్పదని కాలం చెబుతూనే ఉంది. ద్విచక్రవాహనాలు నడిపేందుకు నేటి కుర్రకారు ఆసక్తి కనబరుస్తున్నారు. తెలిసీ తెలియని వయసులో వాహనాన్ని వేగంగా నడుపుతూ అడ్డూ అదుపులేకుండా దూసుకెళుతున్నారు. సరదా షికారు మోజులో ప్రాణాలమీదకు తెచ్చుకుంటూ తల్లిదండ్రులకు గర్భశోకం మిగుల్చుతున్నారు.

అతివేగంతో పోతున్న ప్రాణాలు

చేతిలో వాహనం ఉంటే హద్దులు మరచిపోతున్నారు. ఇంట్లోవారికి తెలియకుండా బయటకు తీసి పెద్ద పెద్ద శబ్దాలు చేస్తూ రయ్...రయ్ మంటూ యువత రోడ్లపైకి వస్తున్నారు. ఈ క్రమంలో వేగాన్ని అదుపుచేయలేక ఎదురుగా వస్తున్న వాహనాలను ఢీకొడుతున్నారు. సినిమా హీరోల్లా చేతులువదిలి డ్రైవింగ్‌చేస్తూ పట్టుతప్పి ప్రమాదాల భారిన పడుతున్నారు. ఒక్కవాహనం మీద ముగ్గురూ లేదా నలుగురు కూర్చుని గాల్లో తేలిపోతున్నట్లు అతివేగంగా, అడ్డదిడ్డంగా నడుపుతూ పాదచారులు, వాహనదారులు, ఎదురుగా వస్తున్నవారిని గాయపరుస్తూ వీరూ ప్రమాదాల భారినపడి కాళ్లు చేతులు విరిగిపోవడంతో వికలాంగులుగా మంచానికి పరిమితమవుతున్నారు.

చెడు అలవాట్లకు బానిసలవుతూ

దేశానికి, కుటుంబానికి వెన్నుదన్నులా ఉండాల్సిన నేటి యువత చెడు అలవాట్లకు బానిసలవుతున్నారు. ఎంజాయ్‌పేర్లతో పార్టీలు చేసుకుంటూ చెడుమార్గంలో పయనిస్తున్నారు. ద్విచక్ర వాహన దారులతో జిల్లా వ్యాప్తంగా ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఎటునుంచి ఏ వాహనం వస్తుందో.. ఎక్కడ తగిలి ప్రమాదాల భారినపడతామోనని ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు.



సంక్రాంతి రోజు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కోనసుమంత్ (ఫైల్‌ఫొటో)

ట్రాఫిక్‌పై అవగాహన అవసరం

18 ఏళ్లలోపు పిల్లలు ద్విచక్రవాహనాలను నియంత్రించే సామర్థ్యాలు వారికి ఉండవు. మోటారు వెహికల్ చట్టాలు నిబంధనలపై అవగాహన ఉండదు. ద్విచక్రవాహనాల అనుమతులు పొందేందుకు అర్హులుకారు. విషయాలన్నీ తెలియజేసేందుకు రోడ్డు భద్రతా వారోత్సవాలు, సాధారణ రోజుల్లోనూ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పూర్తిస్థాయిలో యువతకు అవగాహన లేకపోవడంతో, నిబంధనలు పాటించక పోవడంతో రోడ్డు ప్రమాదాలు భారినపడడమే గాకుండా మృత్యువాతపడుతున్నారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వరాదు



డ్రైవింగ్ లైసెన్స్ లేనిదే ఎవరికీ వాహనాలు ఇవ్వరాదు. ముఖ్యంగా ద్విచక్రవాహనాలను పిల్లలకు ఇవ్వకూడదు. వారు ఓవర్‌స్పీడు వెళ్లడం, రైజింగ్‌చేస్తూ ప్రమాదాలను కొనితెచ్చుకుంటున్నారు. రహదారులపై రాంగ్ డ్రైవింగ్, హెల్మెట్ పెట్టుకోకుండా వాహనాలు నడపడం, త్రిపుల్‌రైడింగ్ వంటివి చట్టరీత్యానేరం. తల్లిదండ్రులు జీవనోపాధికి గల్ఫ్‌దేశాలకు వెళ్లి, ఇంటి వద్ద పిల్లల బాధ్యతను అవ్వాతాతలకు అప్పగిస్తుండడంతో పిల్లలు ఎవరికీ తెలియకుండా వాహనాలను ఎలాపడితే అలా నడుపుతూ ప్రమాదాల భారినపడుతూ వందేళ్ల జీవితాన్ని అంధకారంలోకి నెట్టుకుంటున్నారు. రోడ్డుభద్రతలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పిస్తూ పాఠశాల, కళాశాలల్లో విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నా, నిబంధనలను అతిక్రమించి వాహనాలను నడుపుతున్నారు. అట్టివారిపై కేసులు నమోదు చేస్తున్నాం. తల్లిదండ్రులు, పిల్లలపట్ల జాగ్రత్తలు వహిస్తూ, విలువలు నేర్పిస్తూ మంచినడవడికతో పిల్లలను పెంచాలని.

రాజగోపాల్, బద్వేలు అర్బన్ సీఐ

'వైఎస్'కు వెన్నుదన్ను 'దేవగుడి'

ఆది చేస్తున్న అభివృద్ధి ఓర్వలేక విమర్శలు ● జీవితమంతా డమ్మీగా మారొద్దు
విలేకరులతో కూటమి నేత గోనా పురుషోత్తం రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న కూటమి నేతలు గోనా పురుషోత్తంరెడ్డి, నాగేశ్వరరెడ్డి

జమ్మలమడుగు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ప్రతిసారీ వైఎస్ కుటుంబానికి అత్యధిక ఓట్లు తెప్పించి వారిని గెలిపించిన ఘనత దేవగుడి కుటుంబానిదేనని కూటమి నేత గోనా పురుషోత్తంరెడ్డి అన్నారు. ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డిపై ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి చేసిన విమర్శలపై బీజేపీ కార్యాలయంలో విలేకరులతో కూటమి నేతలు మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ఉన్నంతకాలం జమ్మలమడుగు అభివృద్ధి జరిగిందని, ఎమ్మెల్సీ రామసుబ్బారెడి మంత్రిగా ఉన్నా అభివృద్ధి చేశారా అంటూ సూటిగా ప్రశ్నించారు. దేవగుడి కుటుంబం ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి చేస్తున్న, చేసిన అభివృద్ధిని ఓర్వలేక విమర్శలు చేస్తున్నారన్నారు. రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి వ్యవసాయం చేస్తానని చెప్పి రాజీనామా చేస్తే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆ పార్టీ చేసిన తప్పుడు అక్రమాలు ఎక్కడ బయటపడతాయోనని కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నాలుగు వేల మెజార్టీతో ఎంపీగా గెలిచినప్పుడు జమ్మలమడుగులో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి వైఎస్ కుటుంబానికి అత్యధికంగా ఓట్లు వేయించి గెలిపించిన ఘనత ఆదిదేనన్నారు. ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి నిద్రావస్థలో లేకుండా హుషారుగా బయటకు రావాలని అప్పుడే చేసిన అభివృద్ధి తెలుస్తుందన్నారు. వైసీపీ హయాంలో జమ్మలమడుగులో అభివృద్ధి ఏమేరకు చేశారో ప్రకటించాలని ఆయన సవాల్ విసిరారు. టీడీపీ కూటమి నేతలు దేవగుడి యూత్ సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా సుధీర్‌రెడ్డి అన్ని ప్రాంతాల్లో టిప్పర్లతో ఇసుకను బయటి ప్రాంతాలకు అమ్ముకుని వ్యాపారం చేశారన్నారు. గతంలో చంద్రబాబు ఆదేశాల మేరకు భూపేశ్‌రెడ్డి తామంతా కలిసి అంబవరం పెన్నానదిలో ఇసుక రీచ్ వద్దకు వెళ్లినప్పుడు నిరసన చేసి బయటకు వస్తే వైసీపీ వారు దారిలో అడ్డుకుని డ్రైవర్‌ను తామే కొట్టామని ఎస్సీ, ఎస్టీ తప్పుడు కేసు తమపై పెట్టారన్నారు. ప్రస్తుతం ఆస్పత్రిలో ప్రభుత్వ వసతి గృహాలు, రోడ్లు, కాల్వలు అభివృద్ధి చేస్తుంటే ఓర్వలేకున్నారన్నారు. ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డిపై విమర్శలు చేస్తే ఊరుకునేది లేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు చౌడం జొల్లు కొండయ్య, నవాబు పేట మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఖాకీ క్రౌర్యానికి వ్యక్తి బలి

స్టేషన్ ఆవరణలోనే విషద్రావణం తాగిన గంగాధర్ ● ఎస్‌ఐ వేధింపులతోనే ఆత్మహత్య
శోకసంద్రంలో కుటుంబ సభ్యులు ● పోలీసు స్టేషన్ ఎదుట కుటుంబ సభ్యుల ధర్నా





ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గంగాధర్ - పోలీసుస్టేషనుఎదుట ధర్నా చేస్తున్న కుటుంబీకులు

పులివెందుల టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఖాకీల క్రౌర్యానికి సామాన్యుడు బలి అయిన సంఘటన పులివెందులలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ వేధింపుల తాళలేక మోటున్నూతల పల్లె వాసి రెడ్డిబోయిన గంగాధర్ (30) పోలీసుస్టేషన్ ఆవరణలోనే విషద్రావణం తాగి మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల్లోకి వెళితే..

రెడ్డిబోయిన గంగాధర్ అదే గ్రామానికి చెందిన గడ్డం గంగాధర్ భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని ఆరోపణ. ఈ విషయమై పెద్దమనుషుల వద్ద పంచాయతీ కూడా జరిగింది. అయితే గడ్డం గంగాధర్ భార్యను ఇటీవల రెడ్డిబోయిన గంగాధర్ వేధింపులకు గురిచేసేవాడని ఇదే క్రమంలో 23న బైకుపై వస్తున్న గడ్డం గంగాధర్ తలపై కర్రతో బలంగా కొట్టాడు. దీంతో గాయాల పాలైన గడ్డం గంగాధర్ ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో పోలీసులు వెదుకుతుండగా రెడ్డిబోయిన గంగాధర్ తప్పించుకుని తిరుగుతున్నాడు. కాగా హఠాత్తుగా మంగళవారం మధ్యాహ్నం రెడ్డిబోయిన గంగాధర్ పోలీసుస్టేషన్ ఆవరణలో ప్రత్యక్షమయ్యాడు. అప్పటికే ఎస్‌ఐ వేధింపులతో తాను ఆత్మహత్యకు పాల్పడుతున్నానని చెబుతూ విషద్రావణం తాగాడు. గమనించిన సిబ్బంది అతన్ని ఆటోలో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే పరిస్థితి విషమించిందని మెరుగైన చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించాలని వైద్యులు తెలిపారు. అతన్ని కడపకు తరలిస్తుండగా మృతి చెందాడని కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ తెలిపారు.

శోక సంద్రంలో కుటుంబ సభ్యులు

రెడ్డిబోయిన గంగాధర్ మృతి చెందడంతో గంగాధర్ కుటుంబం శోకసంద్రంలో మునిగింది. ఇతడికి భార్య సౌజన్య, ముగ్గురు కుమార్తెలు ఒక కుమారుడు ఉన్నారు. మా కుటుంబానికి దిక్కు ఎవరని రోదనలు పలువురిని కలచివేసింది.

స్టేషన్ ముందు ధర్నా



పోలీసుస్టేషన్ ఎదుట విషద్రావణం తాగుతున్న గంగాధర్

రెడ్డిబోయిన గంగాధర్ మృతి చెందడంతో తండ్రి క్రిష్ణయ్య, తల్లి నరసమ్మ, భార్య సౌజన్య, ముగ్గురు కుమార్తెలు కుమారుడుతో కలిసి పోలీసుస్టేషను ఎదుట న్యాయం చేయాలంటూ ధర్నాకు దిగారు. దీంతో కుటుంబ సభ్యులను సీఐ పోలీసుస్టేషన్‌కు పిలిపించుకుని వాస్తవాలపై మాట్లాడి న్యాయం జరిగేలా చేస్తానని చెప్పారు. మరి ఏ మేరకు ఆ కుటుంబ సభ్యులకు న్యాయం జరుగుతుందో వేచి చూడాల్సిందే.

మనో వికాసానికి మార్గం ధ్యానం : వీసీ



మాట్లాడుతున్న యోగా ఫౌండేషన్ కార్యదర్శి ఆర్.శిరీష

కడప ఎడ్యుకేషన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మనోవికాసానికి ధ్యానం టానిక్‌లా పనిచేస్తుందని వైవీయూ వీసీ ఆచార్య కె.కృష్ణారెడ్డి అన్నారు. వర్సిటీ సైన్స్ బ్లాక్ సెమినార్ హాల్‌లో విశాఖపట్నంలోని దివ్య బాబాజీ సుషుమ్న యోగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ధ్యానంపై శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడుతూ మనస్సు ఆందోళన నుంచి విముక్తి పొంది ప్రశాంతత ఇవ్వడంలో ధ్యానం సహకరిస్తుందన్నారు. దివ్య బాబాజీ సుషుమ్న యోగా ఫౌండేషన్ కార్యదర్శి ఆర్.శిరీష మాట్లాడుతూ ధ్యానం ద్వారా కలిగే ప్రయోజనాలు వివరించారు. సుషుమ్న క్రియ అనేది నాలుగు రకాల ధ్యానాల కలయిక అని వివరించి అవగాహన కల్పించారు. కళ్లు కాకుండా కనుబొమ్మల మధ్య దృష్టి కేంద్రీకరించాలని, శ్వాసపై దృష్టి నిలపాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథ్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పద్మ, అధ్యాపకులు, రీసెర్చ్ స్కాలర్‌లు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ కాలనీలో విషజ్వరాలు

వీరపునాయునిపల్లె, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కాలనీ వాసులకు వారం రోజులుగా విషజ్వరాలు ప్రబలుతున్నాయి. వైద్య సిబ్బంది మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎస్సీ కాలనీలో 36 కుటుంబాలు ఉండగా ప్రతి కుటుంబంలో ఒకరిద్దరు చొప్పున దాదాపు 50 నుంచి 60మందికి జ్వరాలు వచ్చాయి. అయితే అక్కడ పనిచేస్తున్న ఏఎన్‌ఎం కనీసం ఒక కుటుంబానికి మాత్రలు ఇచ్చిన పాపాన పోలేదని వాపోతున్నారు. అధికారులు స్పందించి వైద్యాధికారులు పర్యటించి జ్వర పరీడితులకు వైద్యం అందించాలని అన్నారు.

మా సమస్యలకు పరిష్కారం లేదా?



చర్చావేదికలో మాట్లాడుతున్న ఆంధ్రజ్యోతి ఎడిషన్ ఇన్‌చార్జి సుంకోజి దేవేంద్రాచారి

- అధికారులను ప్రశ్నించిన అశోక్‌నగర్‌వాసులు
- పరిష్కారానికి చొరవచూపుతామన్న మేయరు సురేశ్‌బాబు



చెన్నూరు/కడప ఎన్జీఆర్ సర్కిల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మా కాలనీలో దీర్ఘకాలికంగా నెలకొన్న సమస్యలకు పరిష్కారం లేదా అని అశోక్‌నగర్‌వాసులు అధికారులను ప్రశ్నించారు. మంగళవారం కడప నగరం 5వ వార్డు అశోక్‌నగర్‌లో ఆంధ్రజ్యోతి దినపత్రిక ఆధ్వర్యంలో 'అక్షరం అండగా.. సమస్యల పరిష్కారమే అజెండాగా' నిర్వహించిన చర్చావేదిక కార్యక్రమానికి స్థానికులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. తమ ఇబ్బందులను వివరించారు. వీటికి సంబంధిత సచివాలయ సిబ్బంది, అధికారులు, నగర మేయరు సురేశ్‌బాబు సమధానమిచ్చారు. మేయరు మాట్లాడుతూ ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో జరిగిన చర్చావేదికలో ఇలాంటి చర్చా వేదికలు జరుగుతుంటే ప్రజల సమస్యలు తెలుస్తాయి. ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు అని పేర్కొన్నారు.



ఆంధ్రజ్యోతి దినపత్రిక చదువుతున్న మేయర్ సురేశ్‌బాబు



మాట్లాడుతున్న ఆంధ్రజ్యోతి బ్రాంచ్ మేనేజర్ అబ్బిగారి నరసయ్య



కార్యక్రమంలో మాట్లాడుతున్న 5వ డివిజన్ కార్పొరేటర్ బండి జయమ్మ

అక్షరం అండగా పరిష్కారమే అజెండాగా కార్యక్రమానికి స్పందన



తన సమస్యను అధికారులకు తెలియజేస్తున్న అశోక్‌నగర్ మహిళ

కడప ఎర్రముక్కపల్లె, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి చేపట్టిన అక్షరం అండగా పరిష్కారమే అజెండాగా చేపట్టిన చర్చావేదిక కార్యరూపంగా రూపాంతరం చెందింది. కడప నగరం అశోక్‌నగర్‌లో గత మూడు రోజులుగా ఆంధ్రజ్యోతి స్థానిక సమస్యలు గుర్తించి వాటిని ప్రచురించింది. మంగళవారం అధికారులు, ప్రజాప్రతినిధులను సమన్వయం చేస్తూ చర్చావేదిక నిర్వహించింది. అధికారులు స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు మొదలుపెట్టారు. మంగళవారం పారిశుధ్యం, పూడికతీత ప్రారంభించారు. అలాగే ప్రమాదకరంగా ఉన్న స్పీడ్ బ్రేకర్లను చిన్నచౌక్ ఎస్ఐ రాజరాజేశ్వర్ రెడ్డి తొలగించే చర్యలు చేపట్టారు.



ప్రజల సమస్యలకు సమాధానం ఇస్తున్న మేయర్

నీరు వృథా అవుతోంది




ఫజల్, అశోక్‌నగర్‌వాసి : సచివాలయం పక్కనే నీళ్ల ట్యాంకు ఉంది. దాని పక్కన అంగన్వాడీ కేంద్రం ఉంది. నీరంతా వృథాగా పోతోంది.

ఏఈ ప్రభాకర్‌రెడ్డి : కుళాయిలకు డమ్మీలు పెట్టాం. స్థానికులు వాటిని ఊడదీస్తున్నారు.

మేయరు సురేశ్‌బాబు : నీటి వృథాపై అవగాహన పెంచాలి. రానున్న వేసవిలో నీటి సమస్య ఉండవచ్చు.

ఐదేళ్లుగా పింఛను రాలేదు



రవికుమార్: ఐదేళ్ల క్రితం మామ చనిపోయాడని పలుమార్లు చెప్పాం. అయినా పట్టించుకోవడంలేదు. ఇంకా ఎన్నిమార్లు చెప్పాలో అర్థం కాడం లేదు. స్పందించాలి.

మేయరు : ఇలాంటి విషయాలను సచివాలయ సిబ్బంది ప్రజలకు వివరంగా చెప్పాలి. వారిని పదే పదే తిప్పుకోవడం భావ్యం కాదు. గుర్తుంచుకోండి.

నాలుగేళ్లుగా పింఛన్ రాలేదు



రోషన్‌బీ: నాలుగేళ్ల క్రితం మా భర్త చనిపోయాడు. అప్పటి నుంచి వితంతు పింఛను కోసం సచివాలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నా. పట్టించుకోలేదు.

మేయరు : సచివాలయంలో పది మంది సిబ్బంది ఉన్నారు. ఒక్కొక్కరికి 10 ఇళ్లు కూడా రావు. ఈ సమస్యపై వెంటనే దృష్టి పెట్టండి.

వీధిలైట్లు అడిగినా స్పందన లేదు



కూరపాటి నాగమ్మ: మా వీధి లో లైట్లు వేయాలని అడిగి.. అడిగి విసిగిపోయాం. మురుగునీరు నిలిచి ఇబ్బందిగా ఉంది. 104 వాహనం వస్తున్నా మందులు ఇవ్వడంలేదు.

మేయరు : మురుగునీరు నిల్వడకుండా చూడాలి. ఖాళీ స్థలాలున్న వారికి నోటీసులు ఇవ్వండి. 104 వాహనాలు పెట్టిందే మందులు ఇవ్వడానికి, ఇలా చేస్తే ఎలా?

సగం రోడ్లు వేయలేదు



మహబూబ్‌బాషా: అశోక్‌నగర్‌లో సగం రోడ్లు వేయలేదు. నడవాలంటే కష్టంగా ఉంది.

మేయర్ : ఐదో డివిజనుకు రూ.20 లక్షల నుంచి 25 లక్షలు మౌలిక వసతుల కోసం ఇస్తున్నాం. అందులో ఈ అశోక్‌నగర్‌కు మొదటి ప్రాధాన్యత నిస్తున్నా. అన్ని రోడ్లనూ పూర్తి చేయిస్తాం.

రాత్రివేళ ఇబ్బందిగా ఉంది



ఇమ్మానుయేల్ రాజు: అలీబాబా చికెన్‌సెంటరు వద్ద రాత్రి 9 నుంచి 10 గంటల మధ్య కొందరు పిల్లలంతా గుమికూడి తాగి అల్లరి చేస్తున్నారు. 108కు ఫోను చేసినా స్పందన లేదు.

ఎస్ఐ రాజరాజేశ్వరరెడ్డి : 100కు ఫోను చేసి సమాధానం రాకపోతే.. మా స్టేషన్ నెంబరు 9121100521కు ఫోను చేసి సమాచారం ఇస్తే వెంటనే వస్తాం.

ఫుట్‌పాత్ వద్ద ఇబ్బందిగా ఉంది

శ్రీనివాసులు: ఫుట్‌పాత్ వద్ద పాదచారులు, వృద్ధులకు ఇబ్బందిగా ఉంది. మరియాపురం చర్చి వద్ద ఎలాగుందో అలా ఏర్పాటు ఏర్పాటు చేయాలి.

మేయరు : జీరో టుడోర్ చెత్త కలెక్షన్ వంద శాతం పూర్తి చేయిస్తా. సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం వహించ వద్దు.

అశోక్‌నగర్‌లో సమస్యలే తప్ప అభివృద్ధి లేదు



బోసం శిలాజ్: అశోక్‌నగర్‌లో సమస్యలన్నీ తీర్చాం. అభివృద్ధి బ్రహ్మాండంగా ఉందని చెబుతున్నారు. అభివృద్ధి ఎక్కడ జరిగిందో వారే చెప్పాలి.

మేయరు : ఈ సమస్యలన్నీ ప రిశీలించి తప్పక చర్యలు తీసుకుంటాం. ఏ సమస్యా లేకుండా చూస్తా.

62 స్పీడ్ బ్రేకర్లు ఉన్నాయి

భాస్కర్: వీధివీధినా మొత్తం 62 స్పీడ్ బ్రేకర్లు ఉన్నాయి. వాహనాల్లో వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంది. వెంటనే తొలగించండి. లేదంటే మా ప్రాణాలకే ముప్పు ఏర్పడుతుంది.

మేయరు : స్పీడ్ బ్రేకర్లు మేం వేయలే. వీటిని తొలగించేందుకు సిబ్బందిని పంపి ప్రజలకు కౌన్సెలింగ్ ఇచ్చి రోడ్డుకు తగ్గులో ఉండేటట్లు ఏర్పాటు చేయిస్తాం.

వర్షం వస్తే ఇబ్బందిగా ఉంది



శ్రీనివాసులు రాయల్: వేదాచలం నగర్‌లో అధికారులు రోడ్లు వేయలేదు. మేమే స్వయంగా ఏర్పాటు చేసుకున్నాం. అయితే మట్టిరోడ్లు. వీటి వల్ల ఇబ్బందిగా ఉంది.

మేయరు : ఈ రోడ్ల విషయం త్వరలో పరిష్కరించేలా చూస్తా. కాంట్రాక్టర్లు ముందుకువచ్చేలా చర్యలు తీసుకుంటాం.

పింఛను ఇప్పించండి...



మేరి: చాలా ఏళ్లుగా క్యాన్సర్‌తో బాధపడుతున్నా. పింఛను ఇవ్వండి. చాలా సార్లు అధికారులను అడిగినా ఫలితం లేదు.

సచివాలయ ఉద్యోగి : క్యాన్సర్ రోగులకు పింఛను ఇవ్వాలనేది ప్రభుత్వం చెప్పలేదు. అనుమతిస్తే తప్పక ఇస్తాం.

మేయరు : ఇలాంటి వారి పట్ల కాస్త ఉదారంగా ఉండండి. ఏదైనా అవకాశం ఉందేమో చూడండి.

గంజాయి బ్యాచ్‌లు ఎక్కువయ్యాయి



మెంటా రఘురాం: గంజాయి బ్యాచ్‌లు, తాగుబోతులు ఎక్కువయ్యారు. మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారు. కొన్నేళ్లుగా ఈ పరిస్థితి మరీ ఎక్కువైంది.

ఎస్ఐ : ఇలాంటి వారిని వదలం. మాకు చిన్న సమాచారం ఇవ్వండి, మీకు అండగా ఉంటాం. మీ సమస్యలు తీరుస్తాం. ఇబ్బందులు లేకుండా చూస్తాం.

15 ఏళ్లుగా సమస్యలు పట్టించుకోనేవారే లేరు

బోసం అబ్రహాం: 15 ఏళ్లుగా ఈ ప్రాంతం కార్పొరేటర్లు ప్రజల సమస్యలు తీర్చడంలో విఫలమయ్యారు. రోడ్లు లేవు. డ్రైనేజీలు లేవు. వీధుల్లో మొత్తం కుక్కలు, పందులు తిరుగుతున్నాయి. కనీసం మురుగుకాల్వల్లో పూడికలు తీయలేదు. దుర్వాసన వస్తుంది. మేమంతా ఇబ్బందులు పడుతున్నాం.

మేయరు : ఇప్పటికే అభివృద్ధి పనులు చేపట్టాం. ఇంకా అభివృద్ధి పనులకు అవసరమైన నిధులు నిధులు ఇస్తాం. ఎలాంటి సమస్య లేకుండా సంబంధిత సిబ్బందిని ఆయా ప్రాంతాలకు పంపించి ఇబ్బందులు లేకుండా చేస్తాం.

గంజాయి మత్తులో యువత



ప్రసాద్, డ్రైవరు: ఈ ప్రాంతంలో యువత గంజాయి, మందు సేవించి తిరుగుతున్నారు. అసభ్యంగా మాట్లాడుకుంటున్నారు.

ఎస్ఐ : రోజూ నైట్ బీట్ పది మంది పోలీసులు తిరుగుతున్నారు. ఏ సమయంలో ఫోను చేసినా స్పందించి సమస్య పరిష్కరిస్తాం. నార్కోటిక్స్ సెల్ ఆధ్వర్యంలో మరింత నిఘా పెంచుతాం.

8176 మీటర్ల మేర రోడ్లు వేయలేదు



బండి జయశేఖర్: 5వ డివిజను అశోక్‌నగర్‌లో అభివృద్ధి చేశామని చెప్పుకుంటున్నారు. నేటికీ 8176 మీటర్ల రోడ్డు పెండింగులో ఉంది. 1995లో అప్పటి టీడీపీ ప్రభుత్వంలోనే రోడ్లు, డ్రైనేజీ వేశారు తప్ప కొత్తగా ఏం వేయలేదు.

మేయరు : అన్ని వీధులు పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం.

'ఎన్నికల హామీలు ఏమయ్యాయి'



మాట్లాడుతున్న అంజద్‌బాషా

కడప ఎర్రముక్కపల్లె, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ప్రజలకు చంద్రబాబు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని వైసీపీ మాజీ ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా ప్రశ్నించారు. రాష్ట్రంలో ఆర్థికభారం ఉన్న విషయం తెలిసి కూడా ఎలా హామీలు ఇస్తారన్నారు. మంగళవారం కడప నగరంలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాల ఊసే లేదన్నారు.

ప్రతి అధికారీ అభివృద్ధికి సహకరించాలి: ఎమ్మెల్యే

కమలాపురం రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : కమలాపురం మండల అభివృద్ధికి ప్రతి అధికారీ సహకరించాలని ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో సభా భవనం నందు మండల స్థాయి సర్వసభ్య సమావేశం ఎంపీపీ భారతి అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా ఎంపీడీవో కార్యాలయంలో నూతన వసతులతో ఆధునీకరించిన మండల కార్యాలయాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం మండల సాధారణ సమావేశంలో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. తహసీల్దారు శివరామిరెడ్డి, మండల స్పెషల్ ఆఫీసరు ఎంపీడీవో జ్యోతి, ఏపీయం గంగాధర్, విద్యుత్ ఏఈ చాంద్‌బాషా, హౌసింగ్ ఏఈ ప్రతాప్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ నిరంజన్‌రెడ్డి, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు భారతి, ఎంఈవో సుభాషిణి పాల్గొన్నారు.

'జగన్‌రెడ్డి పతనానికి యువగళం నాంది'

కడప మారుతీనగర్, జనవరి 28: సరిగ్గా రెండు సంవత్సరాల క్రితం రాష్ట్ర ఐ.టి, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర గత వైసీపీ అధినేత జగన్‌రెడ్డి పాలన పతనానికి నాంది పలికిందని టీఎన్ఎస్ఎఫ్ పార్లమెంట్ ఉపాధ్యక్షులు ఏటూరి లోకేశ్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక టీఎన్ఎస్ఎఫ్ నగర కమిటీ కార్యాలయం నందు ఏటూరి లోకేష్ ఆధ్వర్యంలో కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించారు.

'విద్యార్థుల ఆత్మహత్యలపై చర్యలు తీసుకోవాలి'

కడప ఎడ్యుకేషన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఆత్మహత్యలపై విచారణ జరిపి సంబంధిత కళాశాల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయిశ్రీనివాసరెడ్డి కోరారు. మంగళవారం విద్యార్థుల ఆత్మహత్యలపై టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూమిరెడ్డి సాయిశ్రీనివాస్‌రెడ్డి ముఖ్యమంత్రి నారాచంద్రబాబుకు లేఖ రాశారు.

ఏఎఫ్ఏయూ సెమిస్టర్ పరీక్ష ఫలితాలు విడుదల

కడప ఎడ్యుకేషన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ మరియు ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలోని 1, 9 సెమిస్టర్ పరీక్షల ఫలితాలను వర్సిటీ ఉపకులపతి ఆచార్య జి.విశ్వనాథకుమార్ బుధవారం విడుదల చేశారు. ఈ కార్యక్రమలో రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్‌రెడ్డి, వర్సిటీ అదనపు పరీక్షల నియత్రణాధికారి డాక్టర్ జి.ఫణీంద్రరెడ్డి పాల్గొన్నారు.

పారిశుధ్యం, తాగునీటి సమస్య పట్టించుకోకపోతే ఎలా?

వేంపల్లె, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలో పారిశుధ్యం అధ్వాన్నంగా ఉంది, పలు ప్రాంతాలకు పాపాఘ్ని నుంచి తాగునీరు అందడం లేదు, పట్టించుకునే వారే లేరంటూ పలువురు సభ్యులు మండల సమావేశంలో అదికారులను ప్రశ్నించారు. వేంపల్లె మండల సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. జడ్పీటీసీ సభ్యులు రవికుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ-ఆఫీసు అమలు చేయాలి

కడప కలెక్టరేట్ జనవరి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని ప్రభుత్వ కార్యాయాలల్లో ఈ-ఆఫీసు కచ్చితంగా అమలు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో వివిధ శాఖల సిబ్బంది, టైపిస్టులకు ఈ-ఆఫీసు నిర్వహణపై ఎన్ఐసీ ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ ఇప్పటికే ఈ-ఆఫీసు విధానం అన్ని ఆఫీసుల్లో ఆచరణలో ఉందని.. పక్కాగా అమలు చేయాలన్నారు.

బేడ బుడగ జంగం కులానికి ఎస్సీ సర్టిఫికెట్ ఇవ్వాలి

కమలాపురం రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి):భారత రాజ్యాంగం ప్రకారం షెడ్యూలు కులాలు 59.09 నెంబరులో బేడ (బుడగ) జంగం ఎస్సీ కులానికి చెందిన వారే అని, వారికి ఎస్సీ సర్టిఫికెట్ మంజూరు చేయాలని ఏపీ రాష్ట్రబేడ (బుడగ) జంగం ఎస్సీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వనం నాగేశ్వర్‌రావు మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. కె.అప్పాయపల్లె క్రాస్‌రోడ్డులో నివసించే పానేటి శివలింగం తండ్రి జమ్మిచెట్టి బేడ (బుడగ) జంగంవారని, ఆ కుటుంబం తెలంగాణ రాష్ట్రం నుంచి మైగ్రేషన్ అయి చాలా ఏళ్లుగా కె.అప్పాయపల్లె క్రాస్ రోడ్డులో నివసిస్తున్నారన్నారు.

పాత టోల్‌గేటు వద్ద డివైడర్ల ఏర్పాటు

చెన్నూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని హైవే రహదారిపై పాత టోల్‌గేటు వద్ద ఎన్నో ప్రమాదాలు జరిగి పలువురి ప్రాణాలు గాలిలో కలిశాయి. అయినా పాతటోల్‌గేటు వద్ద డివైడర్లు లేక రాత్రి పూట లైట్లు లేక ప్రమాదాలు జరుగుతున్నాయని పలుమార్లు ఆంధ్రజ్యోతి పత్రిక ద్వారా కథనాలు ప్రచురితమయ్యాయి. ఎట్టకేలకు అధికారుల్లో కదలిక వచ్చింది. మంగళవారం టోల్‌గేటు వద్ద డివైడర్లు ఏర్పాటు చేసేందుకు నగర కార్పొరేషన్, హైవే అధికారులు ఆదేశాలు ఇవ్వడంతో పనులకు శ్రీకారం చుట్టారు. డివైడరుతో పాటు లైట్లు కూడా ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.

ఏబీవీపీ రాష్ట్ర కమిటీలో కడప నుంచి ముగ్గురికి చోటు

కడప నాగరాజుపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): అఖిలభారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) విశాఖపట్టణం అల్లూరి సీతారామరాజు నగరంలో ఈనెల 24,25,26 తేదీలలో జరిగిన 43వ రాష్ట్ర మహా సభలలో భాగంగా కడప నగరానికి చెందిన పవన్, లక్ష్మీ యోగివేమన యూనివర్సిటీ నుంచి జావీద్‌ను రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కడప జిల్లా కన్వీనర్ మాణిక్యరాజు, శివ చరణ్, లోహిత్, రంగ, చందు, విష్ణు, అరుణ్ పుల్లయ్య, లిఖిత్ తదితరులు పాల్గొన్నారు.



కడప నగరం విజయదుర్గాదేవి ఆలయంలో రాహుకాల పూజలు నిర్వహిస్తున్న భక్తులు(ఇన్‌సెట్) ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

అక్షర సమరానికి అనూహ్య స్పందన

- హనుమాన్‌నగర్‌లో 'ఆంధ్రజ్యోతి' ఆధ్వర్యంలో అక్షరం అండగా... పరిష్కారమే అజెండాగా చర్చావేదిక
- భారీ సంఖ్యలో హాజరైన మహిళలు ● 'ఆంధ్రజ్యోతి'కి ఎమ్మెల్యే, అధికారుల అభినందనలు





మాట్లాడుతున్న ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, సమావేశానికి హాజరైన స్థానికులు

ప్రొద్దుటూరు టౌన్/ప్రొద్దుటూరు రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి అక్షరం అండగా... పరిష్కారం అజెండాగా 39వ వార్డు హనుమాన్‌నగర్‌లో మంగళవారం 'ఆంధ్రజ్యోతి' నిర్వహించిన చర్చావేదికకు విశేష స్పందన లభించింది. చర్చావేదిక నిర్వహణపై స్థానిక ప్రజలకు సోమవారం అవగాహన కల్పించడంతో ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ముఖ్యంగా మహిళల నుంచి విశేష స్పందన లభించింది. తమ సమస్యలను అధికారుల దృష్టికి తేవడానికి మహిళలు మూడు గంటలపాటు ఓపిగ్గా కూర్చున్నారు. ఒకరితర్వాత ఒకరు తమ సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చారు. పింఛన్లు, ఇళ్లు, జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం పూర్తి చేయడంపై అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అలాగే హనుమాన్‌నగర్‌లో మడూరు కాలువ వెంట సీసీ రోడ్డు నిర్మాణం కాలువల పూడికతీత, మడూరు కాలువ వద్ద నుంచి జమ్మలమడుగు రోడ్డు వరకు రోడ్డు నిర్మాణం వంటి అంశాలను పరిష్కరించాలని స్థానికులు కోరారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి మాట్లాడుతూ జగన్ పాలనలో అభివృద్ధి జరుగకపోగా విపరీతంగా అవినీతి జరిగిందని విమర్శించారు. దీనిపై ప్రజలు చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడానికి తెలుగుదేశం పార్టీని గెలిపించారన్నారు. వైసీపీపై వ్యతిరేకతతో వందకు 70 శాతం మంది తెలుగుదేశం పార్టీకి ఓట్లు వేశారని తెలిపారు.



ప్రభుత్వం ఇచ్చే రాయితీలు, పింఛన్లు, ఇళ్లస్థలాలు ప్రభుత్వం ఇస్తుందని, స్థానికంగా పరిష్కారం కాని విషయాలు ఏవైనా ఉంటే అధికారుల దృష్టికి తెస్తే తగిన చర్యలు తీసుకుంటారన్నారు. ఈ ప్రభుత్వం మీరు ఓట్లు వేసి గెలిపించిన ప్రభుత్వం. ఏ కారణాలవల్ల అయినా మీ సమస్యలు పరిష్కారం కాకపోయినా రెండు నెలల తర్వాత మరోసారి సమావేశం నిర్వహించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కౌన్సిలర్ చింపిరి అనిల్ మాట్లాడుతూ హనుమాన్‌నగర్‌లో మురుగు కాలువలు నిర్మించాల్సి ఉందన్నారు. మడూరు కాలువ వెంబడి సీసీ రోడ్డు నిర్మాణం, కాలువ వద్ద నుంచి జమ్మలమడుగు రోడ్డు వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాల్సి ఉందని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున మాట్లాడుతూ ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన ఇసుక అక్రమ రవాణా వార్తపై స్పందించి తహసీల్దారు గంగయ్యతో కలిసి భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఇసుక అక్రమ రవాణా జరుగకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. మడూరు కాలువ నుంచి కోతి సమాధి మీదుగా జమ్మలమడుగు రోడ్డు వరకు, మడూరు కాలువ వెంట రోడ్డు నిర్మాణానికి కాంట్రాక్టర్ సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఆక్రమణ తొలగింపునకు ప్రజలు సహకరిస్తే త్వరగా రోడ్డు నిర్మాణం చేపడతామని తెలిపారు. అనంతరం తమ సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏఈ రాజబాబు, ఆర్‌ఐ నాగమోహన్‌రెడ్డి, మున్సిపల్ ఏసీపీ నాగరాజు, త్రీటౌన్ ఎస్‌ఐ యోగేంద్ర, స్థానిక బీసీ నాయకులు బొర్రా రామాంజనేయులు, సిద్ధయ్య, గంజికుంట అంజి, కౌన్సిలర్లు మురళీధర్‌రెడ్డి, కమాల్‌బాష, టౌన్‌బ్యాంకు డైరెక్టర్ గంగాధర్, మాజీ కౌన్సిలర్ వద్దిబాలుడు, తలారి పుల్లయ్య, నాయకులు చౌటపల్లి లక్ష్మీరెడ్డి, అరవ మునివర, నాగార్జున అధికారులు పాల్గొన్నారు.


ప్రజలకు అండగా 'ఆంధ్రజ్యోతి'



గత 23 ఏళ్లుగా ప్రజా సమస్యల పరిష్కారం దిశగా అహర్నిశలు శ్రమిస్తూ 'ఆంధ్రజ్యోతి' దినపత్రిక ప్రజల పక్షాన అండగా నిలిచింది. అధికారులకు, ప్రజా ప్రతినిధులకు, ప్రజల మధ్య వారధిగా నిలిచి అలుపులేని పోరాటం చేస్తున్న 'ఆంధ్రజ్యోతి'ని ప్రతి ఒక్కరూ ఆదరించి, అభిమానించాలి, పత్రిక అభివృద్ధికి కృషి చేయాలి.

రామ్మోహన్‌రెడ్డి, సర్క్యులేషన్ ఇన్‌చార్జి, ఆంధ్రజ్యోతి

వేధిస్తున్న పన్ను సమస్య



నేను హనుమాన్‌నగర్‌లో 35 ఏళ్లుగా నివాసం ఉంటున్నాను. పురపాలిక పరిధిలో ఉంటున్నా పన్ను పంచాయతీ పరిధిలోకి రావడంతో ఇంటికి సంబంధించిన పట్టాలను తీసుకురమ్మని అధికారులు చెబుతున్నారు. కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా సమస్యకు పరిష్కారం దొరకలేదు.

పోసా వెంకటరాముడు, హనుమాన్‌నగర్

వీధిలైట్లు, మురుగు సమస్యను తీర్చాలి



హనుమాన్‌నగర్‌లోని జంగంపేటలో ప్రధానంగా ఉన్న రెండు వీధుల్లో ఒక వీధిలో మంచినీటి సరఫరాకు చిన్నపైపులైన్లు వేశారు. దీంతో నీరు సరఫరా సరిగా కావడంలేదు. రెండో వీధిలో కరెంటు తీగలు వేలాడుతూ ప్రమాదస్థాయిలో ఉన్నాయి. ఈ ప్రాంతంలో రెండు ట్రాన్స్‌ఫార్మర్లను మార్చేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

ఎం.పెద్దజమ్మయ్య, జంగంపేట

భర్త చనిపోయినా పింఛన్ అందలేదు



నా భర్త చనిపోయి ఆరు నెలలు అయింది. పింఛన్‌కోసం దరఖాస్తు చేసుకున్నా ఇంతవరకు నాకు పింఛన్ అందలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం తీసుకున్న నూతన నిర్ణయం మేరకు నాకు త్వరితగతిన పింఛన్ దక్కేలా చర్యలు తీసుకోవాలి.

మేరువ నాగరత్నం, హనుమాన్‌నగర్

అతీగతీ లేని కాలువ నిర్మాణం



హనుమాన్‌నగర్‌లోని రాముని దేవాలయం వీధిలోని కాలువ నిర్మాణం కోసం రెండు నెలల నుంచి దరఖాస్తులు చేసుకుంటున్నాం. మురుగు పారక అవస్థలు ఎదుర్కొంటున్నాం. మురుగు కాలువ నిర్మాణం చేపట్టి సమస్యకు పరిష్కారం చూపాలి.

ఇల్లూరు శేషారెడ్డి

పింఛన్ రావడంలేదు



పింఛన్‌కోసం సచివాలయం, అధికారుల చుట్టూ తిరుగుతున్నాను. ఇంతవరకు మంజూరు కాలేదు. నేను పింఛన్‌కు అన్ని విధాలా అర్హురాలిని. నాకు పింఛన్ అందించి న్యాయం చేయండి.

బి.ఈశ్వరమ్మ

సీఆర్ సెంటర్ కావాలి



పొదుపు సంఘాల మహిళల సమావేశం నిర్వహించేందుకు, సంఘాల నిర్వహణకు, సమావేశాలకు స్థలం లేకుండా పోయింది. వర్షాకాలం, ఎండాకాలంలో చెట్లకింద మీటింగ్‌లను ఏర్పాటు చేసుకుని ఇబ్బందులు పడుతున్నాము. తమకు సీఆర్ సెంటర్ భవన నిర్మాణం చేయించి ఇవ్వాలి. స్థల కొరత ఉంటే సచివాలయం పైభాగంలోనైనా కనీస వసతులతో కూడిన నిర్మాణాన్ని చేపట్టాలి.

కె.లక్ష్మి

పింఛన్ రూ.6 వేలకు పెంచాలి



తనకు ప్రస్తుతం రూ.4 వేలు పింఛన్ అందుతోంది. మోకాళ్ల సమస్యలతో ఇబ్బందులు పడుతున్నాను. అనారోగ్య సమస్యలు వేధిస్తున్నాయి. తనకు రూ.6 వేలు పింఛన్‌ను మంజూరు అయ్యేలా చర్యలు తీసుకోవాలి.

కె.వెంకటరంగమ్మ

డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేయాలి



హనుమాన్‌నగర్‌లోని బాలయ్యస్కూల్ ప్రాంతంలో చెత్తవేసేందుకు మున్సిపాలిటీ డస్ట్‌బిన్‌లను ఏర్పాటు చేయాలి. డస్ట్‌బిన్‌లు లేకపోవడం వలన ఎక్కడ పడితే అక్కడ చెత్తవేస్తూ పరిసరాలు పరిశుభ్రంగా తయారవుతున్నాయి.

గడ్డం కల్యాణి

ఇంటి అద్దె భారంగా మారింది



తమకు సోములవారిపల్లె గ్రామ పొలాల్లో జగనన్న కాలనీ కింద 272 ప్లాట్‌గల ఇళ్ల కేటాయించారు. అందుకు సంబంధించిన ఇంటి నిర్మాణానికి రూ.35 వేలు చెల్లించాను. ఇంటి పని స్లాబ్ నిర్మాణం వరకు జరిగింది. త్వరితగతిన ఇంటిని పూర్తి చేసి తమకు అప్పగిస్తే అక్కడ చేరుతాం. ప్రస్తుతం ఉంటున్న ఇంటికి అద్దె తమకు భారంగా మారింది.

జె.కల్పన

స్తంభాలు, వీధి తీగలు ఏర్పాటు చేయాలి



హనుమాన్‌నగర్‌లో ఓ వీధి సంబంధించి ఇళ్లకు విద్యుత్తు తీగలను వెనుక భాగం నుంచి లాగి ఇంటికి సరఫరా ఇస్తున్నారు. దీంతో అక్కడి వారి నుంచి అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. దీంతో తమ వీధిలో విద్యుత్తు స్తంభాలను ఏర్పాటు చేసి తీగలు లాగి సమస్యకు పరిష్కారం చూపాలి.

సిద్ధయ్య, టీడీపీ వార్డు ఇన్‌చార్జి

సదస్సులు ఏర్పాటు చేయాలి



హనుమాన్‌నగర్ ప్రాంత మహిళలు అహర్నిశలు శ్రమిస్తూ కుటుంబాలకు అండగా నిలిచి కొద్దో గొప్పో సంపాదిస్తుండగా వారి భర్తలు మాత్రం మద్యానికి బానిసై తాగి నిత్యం గొడవలకు పాల్పడుతున్నారు. యువత గంజాయి మత్తులో తూగుతోంది. రాత్రయితే ఈ ప్రాంతంలో అసాంఘిక శక్తులు పేట్రేగుతున్నాయి. మహిళా పోలీసుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా సమస్యకు పరిష్కారం దొరకలేదు. పోలీసు అధికారులు కౌన్సెలింగ్, అవగాహన సదస్సులను ఏర్పాటు చేసి ఇక్కడివారికి ఊరట కల్పించాలి.

పోసా పద్మ, మైత్రి సంఘ అధ్యక్షురాలు

రూ.15 వేలు పింఛన్ మంజూరు చేయాలి



తన భర్త వద్ది ఆదినారాయణ ఊబకాయ సమస్యతో బాధపడుతున్నాడు. 42 సంవత్సరాల వయస్సు ఉన్న ఈయన నడవలేనిస్థితిలో ఉన్నాడు. తమ ఆరోగ్య పరిస్థితి సమీక్షించి తనకు రూ.15 పింఛన్‌ను మంజూరు చేయాలి.

వద్ది లక్ష్మి, హనుమాన్‌నగర్

త్వరితగతిన స్పందించాలి



హనుమాన్‌నగర్ పరిసర ప్రాంతాల్లో డ్వాక్రా మహిళలు, గృహిణులు, ఎదుర్కొంటున్న సమస్యలపై అధికారులు దృష్టి సారించాలి. ఆర్థిక వెసులుబాటు కోసం నడుపుతున్న పొదుపు సంఘాల్లోని సమస్యలను త్వరితగతిన అధికారులు పరిష్కరించాలి.

కనికంటి లక్ష్మి, ఆర్‌పీ సంఘ అధ్యక్షురాలు

కేసు నమోదు

బ్రహ్మంగారిమఠం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : బ్రహ్మంగారిమఠం మండలంలోని జింకల నగర్ గ్రామ సమీపంలో ఇటుకల తో చిన్నపాటి ఏర్పాటు చేసుకున్న గుడిని కూల్చి అందులో ఉన్న దేవుళ్ల పటాలను పగలగొట్టడంతో చిట్వేలు బాలస్వామి అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు బి.మఠం ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు. ఇటీవల సోమిరెడ్డిపల్లె కేశవ, బాలస్వామి ఇరువురి మధ్య భూసమస్య రావడంతో కేశవ ఫిర్యాదు మేరకు బాలస్వామిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గాయపడిన వ్యక్తి మృతి

మైదుకూరు రూరల్ ,జనవరి 28(ఆంధ్రజ్యోతి) : మండలంలోని వనిపెంటలో నివశిస్తున్న కృష్ణ కాంత్ శర్మ (37) ఈనెల 13వ తేదీన సంక్రాంతి పండుగ సందర్భంగా ఇంటి వద్ద బజ్జీలు వేస్తుండగా ప్రమాదవశాత్తు కాగుతున్న నూనె మీద పడి తీవ్రగాయాలు అయ్యాయి. ఆయనను చికిత్స నిమిత్తం చెన్నైలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లుగా బంధువులు తెలిపారు.

ప్రజల సమస్యలను పరిష్కరించాలి

పోరుమామిళ్ల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలో పార్టీలకతీతంగా ప్రజల సమస్యలను పరిష్కరించాలని ప్రజల కందుబాటులో అధికారులు ఉండాలని ఎమ్మెల్యే డాక్టర్ సుధా అన్నారు. మంగళవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో మండల సర్వసభ్యసమావేశం ఎంపీడీవో రమణారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ అన్నిశాఖల అధికారులు, ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు సీఎంబాషా, జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, చెన్నురాజశేఖర్, తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డి, రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవిప్రకాశ్‌రెడ్డి, టేకూరుపేట సర్పంచ్ రమణారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ఒకటి నుంచి తెలుగంగ ఎడమకాలువకు నీటి నిలుపుదల

కాశినాయన జనవరి28 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి 1వ తేదీనుంచి 9వతేదీ వరకు తెలుగంగ ఎడమకాలువకు(కాశినాయన మండలం మీదుగా వెళ్లే) నీటిని నిలుపుదలచేస్తున్నట్లు తెలుగంగ ఈఈ క్రిష్ణారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు ఈరెండు రోజుల్లో సాగుచేసిన ఆరుతడి పంటలకు కాలువ నీటిని వినియోగించుకోవాలన్నారు. తిరిగి 10వ తేదీన నీటిని విడుదలచేసి 25వ తేదీవరకు కొనసాగిస్తామన్నారు.

చెన్నుపల్లె భూములు పరిశీలించిన ఆర్డీవో

కలసపాడు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెన్నుపల్లె గ్రామ దళిత భూములను మంగళవారం బద్వేలు డివిజనల్ అధికారి చంద్రమోహన్ పరిశీలించారు. ఈ సందర్భంగా చెన్నుపల్లె గ్రామ పొలాల్లో దీర్ఘకాలికంగా పెండింగులో ఉన్న భూముల సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. నేషనల్ హ్యూమన్‌రైట్స్ అధ్యక్షుడు ప్రసాదరావు, టీడీపీ అధ్యక్షుడు రంతు, తహసీల్దారు మధురవాణి, రెవెన్యూఇన్‌స్పెక్టరు సింధూజా, డిప్యూటీ తహసీల్దారు మోహన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

'పరిహారం ఇచ్చి ఇళ్లను కూల్చండి'



మాట్లాడుతున్న బాధితులు

ముద్దనూరు జనవరి28(ఆంధ్రజ్యోతి): పరిహారం అందించి ఇళ్లను పడగొట్టాలని కమ్మవారిపల్లె హైవేరోడ్డు బాధితులు మంగళవారం ఆవేదన వ్యక్తం చేశారు.ముద్దనూరు నుంచి తాడిపత్రి వరకు నాలుగు లైన్ల రోడ్డు పనులు జరుగుతున్నాయి.అందులో భాగంగా కమ్మవారిపల్లెలో రోడ్డు ప్రక్కన ఉన్న ఇళ్లకు పరిహారం అందించక ముందే కూల్చేందుకు హైవే రోడ్డు పనులు చేపడుతున్న వారు యంత్రాలు తీసుకొని వచ్చారు. ఇళ్ల ముందున్న చెట్లను తొలగిస్తుండగా బాధితులు అడ్డుకున్నారు. తమకు ఇంత వరకు పరిహారం అందలేదని, పరిహారం అందించి ఇళ్లను పడగొట్టాలన్నారు. దీంతో వారు వెనుదిరిగి పోయారు.

నగదు, మట్కా చీటీలు స్వాధీనం

ప్రొద్దుటూరు ,జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు పట్టణం దస్తగిరిపేటలో మట్కా నిర్వహిస్తున్న నలుగురు వ్యక్తులను టూటౌన్ సీఐ యుగంధర్ ఆధ్వర్యంలో అరెస్టు చేశారు. వారినుంచి రూ. 12,150 నగదును మట్కా పట్టీలను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు అయిన వారిలో శంకరాపురానికి చెందిన మోపూరి సుబ్బారెడ్డి,చాపాడు మండలం విజయ్‌నగర్‌కు చెందిన మారం జేమ్స్, ప్రొద్దుటూరు మండలం నంగనూరు పల్లెకు చెందిన వనిపెంట దస్తగిరి, ముద్దనూరు టౌన్‌కు చెందిన మంజుల శంకర్ వున్నారు. వీరందరిపై కేసు నమోదు చేశారు.

రెండురోజులపాటు నీటి సరఫరాబంద్

- మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి

జమ్మలమడుగు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలో ఈనెల 30, 31వ తేదీ రెండు రోజులపాటు నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు కమిషనర్ వెంకటరామిరెడ్డి తెలిపారు. జమ్మలమడుగు మున్సిపాలిటీకి సంబంధించి తాగునీటి సరఫరా చేసే దొమ్మరనంద్యాల తాగునీటి ట్యాంకు మరమ్మతులు, శుభ్రం చేస్తున్న సందర్భంగా తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. ఎంపీడీవో ఆఫీసు, అమ్మవారిశాల వీధి, అంభాభవానీవీధి, ముచ్చర్ల వీధి, చాకలివీధి తదితర ప్రాంతాల్లో నీటి సరఫరా ఉండదన్నారు. ప్రజలు పై ప్రాంతాల్లో ఉన్నవారంతా 29వ తేదీ రోజు ముందస్తుగా నీటిని నిలువ చేసుకుని పొదుపుగా వాడుకోగలని కమిషనర్ తెలిపారు.

యూరియా కొరత లేదు : ఏవో

పోరుమామిళ్ల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో యూరియా నిల్వలు తగినంత ఉన్నాయని ఏవో వరహరికుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ రైతులల్లో కొరత ఉందనే అపోహతో అవసరం ఉన్న వాటికంటే ఎక్కువ బస్తాలు కొనుగోలు చేసి ఇంట్లో నిల్వ ఉంచుకుంటున్నారన్నారు. రైతు సేవా కేంద్రాల్లో యూరియా అమ్మకం అయి పోయిన వెంటనే మరలా ఆర్డరు తెప్పించి నిల్వ పెట్టడం జరుగుతుందన్నారు. మండలంలో నాలుగు రైతు సేవా కేంద్రాల్లో నేడు వంద టన్నుల యూరియా రావడం అమ్మకం జరుగుతుందన్నారు. అయిపోయాక మరలా తెప్పించడం జరుగుతుందని రైతులు కంగారు పడాల్సిన అవసరంలేదన్నారు. ప్రైవేటు డీలర్ల వద్ద 200 టన్నుల నిల్వ ఉందన్నారు.

హోటళ్లలో ప్లాస్టిక్ నిషేధం

బద్వేలుటౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మున్సిపల్ కమిషనర్, శానిటేషన్ సిబ్బంది పలు హోటల్స్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి మాట్లాడుతూ హోటల్స్‌లో అరిటాకులు, విస్తరాకులు వాడాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన సూచించారు. ప్లాస్టిక్ నిషేధంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. హోటల్స్‌లో భోజనం పార్శిల్స్‌కు ప్లాస్టిక్ కవర్స్ వాడరాదని, విస్తరాకులు, అరిటాకులను వాడాలని ఆయన అన్నారు. ప్లాస్టిక్‌ను వాడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.



హోటల్‌ను తనిఖీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి

ప్రజలకు సురక్షితనీటిని అందించడమే లక్ష్యం

సమగ్రరక్షిత మంచినీటి పథకాన్ని పరిశీలించిన జిల్లా పరిషత్ సీఈవో ఓబులమ్మ

బ్రహ్మంగారిమఠం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు సురక్షిత నీటిని అందించడమే సీపీడబ్ల్యూఎస్ (సమగ్ర మంచినీటి రక్షత పథకం) లక్ష్యమని జిల్లా జిల్లా పరిషత్ సీఈవో ఓబులమ్మ అన్నారు. మంగళవారం తెలుగుగంగలో అంతర్భాగమైన బ్రహ్మంసాగర్ ప్రాజెక్టుపై ఉన్న సమగ్ర రక్షిత మంచినీటి పథకాన్ని ఆమె పరిశీలించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఏడుకొండలు, డీఈలు శివరుద్రగౌడ్, కిరణ్, ఎంపీడీవో వెంగమునిరెడ్డి, ఈవోపీఆర్‌డి రంగయ్య, ఏఈలు వెంకటేశ్, కాంట్రాక్టరు చిలమల నారాయణ, పంచాయితీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు. కాగా వీరబ్రహ్మేంద్రస్వామిని మంగళవారం జిల్లా పరిషత్ సీఈవో ఓబులమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఏడుకొండలు స్వామివారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ మేనేజరు ఎన్.ఈశ్వరయ్యాచారి ప్రత్యేకంగా ఆహ్వానం పలికి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రసాదాలను అందించారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

కొండాపురం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): వ్యాపారసంస్థలు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కొండాపురం ఎస్‌ఐ విద్యాసాగర్ తెలిపారు. మంగళవారం దుకాణ దారులతో ఎస్‌ఐ మాట్లాడారు. దొంగతనాలను గుర్తించడానికి సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగ పడుతా యన్నారు. అదేవిధంగా ప్రైవేటు పాఠశాలల బస్సు డ్రైవర్లకు కూడా కౌన్సెలింగ్ నిర్వహించారు.

జీపుజాతాను జయప్రదం చేయండి

జమ్మలమడుగు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కడప ఉక్కుకోసం ఈనెల 30వ తేదీ నుంచి జరిగే జీపుజాతాను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మనోహర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి యేసుదాసు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

